ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం site.singidinews.com
గురువారం 6 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 50 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

**నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు**

**మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు**



నీట్ పేపర్ లీక వివాదంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత నిరసనలు తెలిపారు. అయితే, విద్యార్థుల్ని బలప్రయోగం, బెదిరింపులతో కేంద్రం అణచివేసిందని లోకసేభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు.

**- న్యూఢిల్లీ,ఆగస్ట్5 (సింగిడి)**

2




2

## ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

**ప్రధాని మోడీకి జుకర్ బర్గ్ క్షమాపణలు**

**కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం**

# వార'సత్తువ' చూపిస్తారా?

## తమిళం.. తెలంగాణం.. వారసత్వ రాజకీయం

### తండ్రులు కట్టిన సామ్రాజ్యాలు.. కొడుకుల సీఎం కలలు

### ఉదయనిధికి విజయ్ ఎంట్రీ.. కేటీఆర్‌కు రేవంత్ సవాల్

### తండ్రుల కలలు.. వారసుల భవిష్యత్

**రాజకీయాల్లో తండ్రి వారసత్వం కొడుకులకు బలం కావచ్చు.. కానీ సీఎం కుర్చీకి అదే ఒక్కటే సరిపోదు. తమిళనాడులో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాజకీయాల్లో కీలకంగా ఎదుగుతుండగా.. తెలంగాణలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయుడు కేటీఆర్ కూడా పార్టీకి ప్రధాన ముఖంగా కొనసాగుతున్నారు. తండ్రుల రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఈ ఇద్దరి ముందూ ఇప్పుడు ఒకే ప్రశ్న.. సీఎం పీఠం దిశగా అడుగులు ఎంతవరకు ఫలిస్తాయి..? తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రవేశం ఉదయనిధి ఎదుగుదలకు కొత్త సవాల్‌గా మారిందన్న చర్చ ఉండగా.. తెలంగాణలో రేవంత్ రెడ్డి తనదైన శైలిలో రాజకీయంగా బలపడటం కేటీఆర్‌కు సవాలుగా మారిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.**

**- (హైదరాబాద్ బ్యూరో-సింగిడి)**



### ఉదయనిధి.. పీఠం దిశగా

ఉదయనిధి స్టాలిన్ తొలుత సినీ రంగంలో కొనసాగి.. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. డీఎంకేలో కీలక బాధ్యతలు చేపట్టి మంత్రిగా ఎదిగి.. డిప్యూటీ సీఎం స్థాయికి చేరుకున్నారు. దీంతో స్టాలిన్ తర్వాత పార్టీ నాయకత్వం, ప్రభుత్వ పగ్గాలు ఉదయనిధికే దక్కుతాయన్న చర్చకు బలం చేకూరింది. అయితే విజయ్ రాజకీయ రంగప్రవేశం తమిళనాడు రాజకీయ సమీకరణాలను మార్చే అంశంగా మారింది. విజయ్‌కు లభించే ప్రజాదరణ, యువతలో ఉన్న ప్రభావం, టీవీకే భవిష్యత్ బలం ఎంతవరకు పెరుగుతుందన్నదే ఉదయనిధి రాజకీయ ప్రయాణానికి కీలకంగా మారనుంది.

### కేటీఆర్.. కేసీఆర్ తర్వాత

తెలంగాణలోనూ ఇదే తరహా చర్చ కొనసాగుతోంది. కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కేటీఆర్.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయనను భవిష్యత్ ముఖ్యమంత్రిగా ప్రాజెక్ట్ చేసిన సందర్భాలు, షాడో సీఎంగా వ్యవహరిస్తున్నారన్న రాజకీయ వ్యాఖ్యలు కూడా వినిపించాయి. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో కేటీఆర్ చురుకుగా పాల్గొంటుండటంతో.. కేసీఆర్ తర్వాత బీఆర్ఎస్ నాయకత్వం ఆయన చేతుల్లోకి వెళ్లే అవకాశాలపై చర్చ కొనసాగుతోంది.

### రేవంత్ ఎఫెక్ట్.. సవాల్

అయితే తెలంగాణ రాజకీయాల్లో పరిస్థితి కేటీఆర్‌కు అంత సులభంగా లేదన్నది మరో విశ్లేషణ. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి తనదైన రాజకీయ శైలితో ప్రభుత్వాన్ని నడిపిస్తూ.. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయ కేంద్రంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం అన్న ధీమాను రేవంత్ వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడం, కేటీఆర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రజల్లో బలంగా నిలబెట్టడం ఆ పార్టీకి కీలక సవాలుగా మారుతోంది.

### వారసత్వం కాదు.. ప్రజాతీర్పు

తమిళనాడులో ఉదయనిధి.. తెలంగాణలో కేటీఆర్.. ఇద్దరికీ రాజకీయ నేపథ్యం, తండ్రుల వారసత్వం బలంగా ఉంది. కానీ వారసత్వం రాజకీయ ప్రవేశానికి మార్గం చూపగలదే తప్ప.. సీఎం పీఠానికి హామీ ఇవ్వదు. పార్టీపై పట్టు, ప్రజల్లో ఆదరణ, ప్రత్యర్థుల బలం, ఎన్నికల సమీకరణాలు, నాయకత్వ సామర్థ్యం.. ఇవన్నీ కలిసొస్తేనే ముఖ్యమంత్రి పీఠం దక్కే అవకాశం ఉంటుంది.

అందుకే తమిళనాడులో విజయ్ ఎంట్రీ ఉదయనిధి రాజకీయ భవిష్యత్తుకు ఎంతటి సవాల్‌గా మారుతుంది.. తెలంగాణలో రేవంత్ రాజకీయ ఎదుగుదల కేటీఆర్‌కు ఎంతటి అడ్డంకిగా నిలుస్తుంది.. అన్నదే ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్న. చివరకు తండ్రులు నిర్మించిన రాజకీయ సామ్రాజ్యాల పగ్గాలు కొడుకుల చేతికి వస్తాయా.. లేక ప్రజాతీర్పు మరో కొత్త నాయకత్వానికే మార్గం చూపుతాయా.. అన్నది రాబోయే ఎన్నికలే తేల్చనున్నాయి.



2

## మా ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వండి

**తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి**

**జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**

**పీఎంకు రాసిన లేఖ... పీఎంవో స్పందనపై చర్చ..**

**చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ**

ప్రాణహితనదిపైతుమ్మిడిహెట్టిబ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన కార్యాలయంలోముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ బుధవారం సమావేశమయ్యారు. **- న్యూఢిల్లీ,ఆగస్ట్5 (సింగిడి)**

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

**గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు**

**18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు**

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీష్ రావు**



2

## క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

**లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా**

**బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్**



## రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

**జార్ఖండ్ నిరుద్యోగులకు సిజెపి మద్దతు**

**దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం**

**సిజెపి నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ**

2

జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు.

**ముంబై,ఆగస్ట్ 5 (సింగిడి)**

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ**

**8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం**

2

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

**పోలీస్, ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్**

**సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్**

## 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

### కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

**ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి**

**అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి**

**22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి**

**కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**



2

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

**హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి)**

## డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

### సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

**సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి**

**భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

2

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

**షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు**



## వడ్డీరేట్లు మరోసారి యథాతథం

**నాలుగోసారీ.. వడ్డీరేట్లను మార్చని ఆర్‌బీఐ**

2

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు.

**- న్యూఢిల్లీ,ఆగస్ట్5 (సింగిడి)**

## రైతుల ఆత్మహత్యలు కనబడడం లేదా

### ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు

**చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు నష్టపోతున్నాయి**

**దేవరపల్లి పర్యటలో జగన్ ఘాటు విమర్శలు.. పొగాకు రైతులకు జగన్ పరామర్శ**



ఏపీలో చంద్రబాబు పాలనలో విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి, అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

**కాకినాడ,ఆగస్ట్5 (సింగిడి)**

2

## సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి


### వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టులకు ప్రణాళిక

**రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు**

**విశాఖ ఎకనామిక రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై చంద్రబాబు**

సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ విశాఖ ఎకనామిక రీజియన్ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం విశాఖ ఎకనామిక రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. **అమరావతి,ఆగస్ట్5 (సింగిడి)**





2

## జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

**దాదాపు 4 శాతం తగ్గిందన్న కేంద్రమంత్రి గడ్కరీ**

జాతీయ రహదారులపై ప్రమాదాల తగ్గినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత నేషనల్ హైవేలపై మరణాల సంఖ్య దాదాపు 4 శాతం తగ్గిందని బుధవారం పార్లమెంటులో వెల్లడించారు. హైవేలపై యాక్సిడెంట్స్‌లలో చనిపోయే వారి సంఖ్య 2025లో 62 వేల 122 కు తగ్గినట్లు చెప్పారు.

**- న్యూఢిల్లీ,ఆగస్ట్5 (సింగిడి)**

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 6 ఆగస్టు 2026

# మా ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వండి

ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తికి పంపిన లేఖ విషయాన్నిముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రితో ప్రస్తావించారు. తుమ్మిడి హెట్టి వద్ద 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టివద్ద148మీటర్ల నుంచి 152మీటర్లవరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అధ్యయనం ప్రకారం 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీగర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం వివరించారు. 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితేగ్రావిటీద్వారా కావల్సినంత నీరు సరఫరాచేయలేమని, కాబట్టి150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు. తుమ్మిడిహెట్టివద్ద150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంతత్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్యసమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రధానమంత్రికార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోసమావేశం ఏర్పాటు చేసి తొలుత తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల పక్రియప్రారంభిస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి తెలియజేశారు. ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని జల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లురవి, వేంనరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వప్రత్యేకప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారుఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

**హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి):** ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా.. అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది.. అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు.

# సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి

ఈ సందర్భంగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక తీసుకోవడంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం ఎకనామిక రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ.3.50 నుంచి రూ.4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ.5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బేసిటీ ప్రాజెక్ట యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూకఽస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేలా విశాఖ ఎకనామిక రీజియన్ ప్రాజెక్టు. రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు.. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ. బేసిటీ ప్రాజెక్ట యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని.. ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక ఎనర్జీ ఉండాలన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలన్నారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. నిధుల కన్వ్జ్గంÖన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలన్నారు.

# 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని పక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## రైతుల ఆత్మహత్యలు
# కనబడడం లేదా

గిట్టుబాటు ధర లేక పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్ బుధవారం తూర్పు గోదావరి జిల్లాలోని దేవరపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పొగాకు యార్డులో రైతులను పరామర్శించి.. కొనుగోలు కేంద్రం వారితో ముఖాముఖి అయ్యారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు నష్టపోతున్నాయి. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో విధ్వంసం కనిపిస్తోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులు. చంద్రబాబుది వెన్నుపోటు పార్టీ. చంద్రబాబు వల్ల ప్రజలకు బాధే మిగిలింది. 27 నెలల బాబు పాలనలో రైతులకు గిట్టుబాటు ధర లేదు. రాష్ట్రంలో రైతులు రోడ్డునపడ్డారు. రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి కనబడటం లేదా. బాధిత రైతు కుటుంబాలను కనీసం పరామర్శించలేదు. చంద్రబాబు పాలనలో రైతులు నష్టపోయారు. పొగాకుతో పాటు ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. పొగాకు రైతులు ఆందోళనలో ఉన్నారు. గిట్టుబాటు ధర రాక వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పెద్దలు పరామర్శించలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో పొగాకు ధర రూ.289గా ఉంది. కానీ, ఇప్పుడు కేజీ పొగాకు ధర రూ.236 మాత్రమే పలుకుతోంది. కూటమి ఉత్తరాది ప్రాంతంలో టొబాకో బోర్డు 49.70 మిలియన్ కేజీల పొగాకును కొనుగోలు చేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ 10 మిలియన్ కేజీలు (20 కంటే తక్కువ) మాత్రమే కొనుగోలు చేశారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 232 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి కాగా. ఇప్పటివరకు కేవలం 47.3 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు జరిగింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ప్రతి గ్రేడ్‌కు ప్రారంభ ధరను నిర్ణయించడం వల్ల కంపెనీల మధ్య పోటీ పెరిగి రైతులకు మంచి ధర లభించింది. రూ. 3,000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఐదేళ్లలో రూ. 7,800 కోట్ల మేర కొనుగోళ్లు చేపట్టాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు రూ. 1 లక్ష వరకు సున్నా వడ్డీ రుణాలు ఇచ్చాం. 84.66 లక్షల మంది రైతులకు రూ. 2,050 కోట్లు అందించాం. చంద్రబాబు వచ్చాక సున్నా వడ్డీ పథకం రద్దు చేశారు. రైతు భరోసా సాయంలో కూడా కోతలు పెట్టారు. చంద్రబాబు పాలన రైతులకు హానికరం. కూటమి ప్రభుత్వం దళారీతో రాజీ పడింది. దళారులు సిండికేటుగా మారి రైతుల పొట్టగొడుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆదుకుంటాం' అని హామీ ఇచ్చారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

**హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు.

# రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు

మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, మీడియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

**నిజామాబాద్,ఆగస్ట్5 (సింగిడి):** తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతానని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల బాలికతో
# బలవంతంగా క్షమాపణలు

విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులు రాజ్యాంగ పరిరక్షకులని, కూప్పకూలుతున్న పనికిరాని విద్యా వ్యవస్థను ప్రశ్నిచడంలో ఎలాంటి తప్పు లేదని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న వారి ఇళ్లకు గుండాలను పంపించారని, ఆ తర్వాత 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలు అంగీకరించారని, ఇది పూర్తిగా అర్థరహితం, దీనిని తాము అంగీకరించమని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని ఆరోపించారు. దేశంలో పారదర్శకంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని అన్నారు. విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, వారిపై లాఠీచార్జ్ చేయడం, వేధించడం సరికాదని అన్నారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై గర్వంగా ఉందని పేర్కొన్నారు.

# ఎట్టకేలకు దిగివచ్చిన మెటా

**న్యూఢిల్లీ,ఆగస్ట్5 (సింగిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎం, డీప్‌ఫేక కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది.

# వడ్డీరేట్లు మరోసారి యథాతథం

ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది నాలుగో సారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్‌లో జరిగిన సమీక్షల్లోనూ వడ్డీరేట్లు ను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హార్ముజ్‌లో నౌకా రాకపోకలకు అంతరాయాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే బలమైన డిమాండ్ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇస్తోంది. చమురు, ఆహారధాన్యాల అధిక ధరల కారణంగా ద్రవ్యోల్బణం పెరిగింది. మూడో త్రైమాసికంలో గరిష్ఠస్థాయికి చేరి, తర్వాత నుంచి కాస్త దిగిరానుంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంచనా వేసిన దానికంటే భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంది. అయితే, పశ్చిమాసియాలో మళ్లీ మొదలైన ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరతలు, ఎల్‌నినో ఎఫెక్ట్.. వృద్ధికి ముప్పుగా మారే అవకాశం ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 6.7 శాతానికి పెంచుతున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను 5.1 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాం. కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యత ఉంది.

# డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి): డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీజెన్‌కో ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

### షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు

**హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి):** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి తనపై చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టును తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టును తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టును తిరిగి కోర్టులో జమ చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టును తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# జాతీయ రహదారులపై తగ్గిన ప్రమాదాలు

2024లో 64 వేల 772 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతే.. 2023లో 63 వేల 112 మంది చనిపోయినట్లు తెలిపారు. ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతూ వస్తుండేదని.. కానీ కోవిడ్ తర్వాత తొలిసారి 2025లో మృతుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. అదే సమయంలో 2025లో రోడ్డు యాక్సిడెంట్ల సంఖ్య 5.30 శాతం పెరిగినట్లు చెప్పారు. అంటే 5.13 లక్షల యాక్సిడెంట్లు జరిగినట్లు చెప్పారు. సరాసరిగా గంటకు 21 మంది చనిపోయినట్లు వెల్లడించారు. నేషనల్ హైవేస్ పై 2025లో లక్షా 43 వేల 526 ప్రమాదాలు జరిగాయి.. ఈ ఏడాది జులై 27 వరకు 77 వేల 234 ప్రమాదాలు జరిగినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తమిళనాడులో ఎక్కువగా జరుగుతున్నట్లు గడ్కరీ చెప్పారు. 71 వేల 387 యాక్సిడెంట్స్‌తో తమిళనాడులో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. అదేసమయంలో రోడ్డు ప్రమాద మృతులలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2025లో ఆ రాష్ట్రంలో 27 వేల 550 మంది చనిపోయినట్లు గణాంకాలు పార్లమెంటుకు తెలిపారు.

## తెలంగాణలో డయల్
# 112 సేవలు ప్రారంభం

**హైదరాబాద్,ఆగస్ట్5 (సింగిడి):** తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎలా పరిష్కరిస్తారో అనేది తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలో పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టీజీఎస్ఆర్టీసీ నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్‌డ్ ఫీచర్లు వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బేస్ట్ టెక్నికల్ సిస్టమ్ ద్వారానే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏఐ సిస్టమ్, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి డయల్ 112కు రీడైరెక్ట్ చేయనున్నట్లు తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జబిలె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. డయల్ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం

Singidi

గురువారం 06-8-2026



# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో..

# ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, ఆగస్టు 05 (సింగిడి):** మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్, బ్రాహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పాఠశాల, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. యువత దేశ భవిష్యత్తు అని, వారిని మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతి నిధులు, పోలీసులు, సామాజిక సంస్థలు, ప్రజలందరిపై ఉందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కూడా తీవ్రంగా దెబ్బతింటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



మాదకద్రవ్యాల వ్యసనం నేరాలు, హింస, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాల పై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత చదువు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. సమాజంలో అవగా హన పెంపొందించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, బాల్ రెడ్డి, నర్రా బిక్షపతి, అశోక్, హనుమంత్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, పృథ్వీరాజ్, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు

- ఎస్ఐఆర్‌లో పాల్గొనడం ప్రతి ఒక్కరి బాధ్యత
- ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం స్థానికంగానే ఓటరు నమోదు చేయించుకోండి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి

**పటాన్చెరు, ఆగస్టు 05 (సింగిడి):** మినీ ఇండియాగా పేరుందిన పటాన్చెరు నియోజక వర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఇతర రాష్ట్రాల ఓటర్లు స్థానికంగానే తమ ఓటు వివరాలను నమోదు చేసుకుని.. పటాన్చెరు నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో రాజస్థాన్, గుజరాత్, శ్రీకాకుళం, రాయలసీమ ప్రాంతా లకు చెందిన ప్రజలతోపాటు, వివిధ రంగాల వ్యాపారస్తులతో ఎస్ఐఆర్ అంశంపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై దిశ నిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం 25 సంవత్సరాల తర్వాత



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపడుతోందాన్ని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజలు స్థానికంగా నివాసమే ఏర్పాటు చేసుకొని తమ జీవనాన్ని కొనసాగిస్తు న్నారని.. వారందరూ విధిగా స్థానికంగానే ఓటరు వివరాలు నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రజలందరినీ సొంత బిడ్డల వలె చూసుకుంటున్నామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రత్యేకంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియడానికి మరో ఐదు రోజుల సమయం మాత్రమే ఉందని.. వివరాలు నమోదు చేయించుకొని వారందరూ తప్పనిసరిగా వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, విజయ్ కుమార్, బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, దామోదర్ రెడ్డి, తేజ, రాజు, రామ్మోహన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోమిన్ పేట ఠాణాను సందర్శించిన ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, ఆగస్టు 05 (సింగిడి):** వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ బుధవారం జిల్లా పరిధిలోని మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డివిజన్ డీఎస్పీ అంజయ్య బొకే అందజేసి జిల్లా ఎస్పీ కి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది టర్న్అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణలో వారి సన్నద్ధత, యూనిఫాం నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, స్టేషన్ హౌస్ రికార్డులు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తు, పోక్సో కేసుల పురోగతి,ఎన్ డి పి ఎస్ కేసులు, ఆస్తుల నిర్వహణ, మాల్ఖానా, స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్స్ నమోదు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, సీసీటీవీ కెమెరాల పనితీరు,







వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన కెమెరాల వినియోగం, గ్రామాలు మరియు పట్టణ ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం సమన్వయం పెంపొందిస్తూ,వికారాబాద్ సురక్ష మిత్ర కార్యక్రమం లో భాగంగా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలపై అవగాహన, మహిళలు మరియు చిన్నారుల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిబంధనల పై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకట్, మోమిన్‌పేట ఎస్ఐ భారత్ భూషణ్, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## భౌరంపేట్ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి

### ప్రజా సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే వివేకానంద




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద గారు స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక ప్రజలు, నాయకులు, గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు, సరిగా లేకపోయిన డ్రైనేజీ వ్యవస్థ, రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో చర్చించి, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ ప్రారంభం

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

### విగ్రహావిష్కరణలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 (సింగిడి):** హైదరాబాద్‌లోని రాయదుర్గంలో గౌడ కులస్తులందరూ ఐక్యంగా కలిసి నిర్మించిన నూతన ఫంక్షన్ హాల్ ను ప్రారంభించడంతో పాటు వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గౌడ కులస్తులందరూ ఐకమత్యంతో ముందుకు సాగి, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితో ఫంక్షన్ హాల్ నిర్మించిన రాయదుర్గం గౌడ కులస్తులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, గౌడ కుల పెద్దలు పల్లె లక్ష్మణ్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, నేమూరి రాములు గౌడ్ తదితర ప్రముఖులతో పాటు స్థానిక గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నెల రోజులు “సురక్షా కా తిరంగా” జాతీయ సైబర్ జాగ్రూకత అవగాహన

- సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అదనపు ఎస్పీ
- సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండండి
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 5 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బి ) డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలరోజుల పాటు “సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ” పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. ఆగస్టు నెల తొలి బుధవారం నిర్వహించే జాతీయ సైబర్ జాగ్రూకత దివస్ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో నిర్వహించన “సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ” సైబర్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో సైబర్ నేరాలు ఒకటని అన్నారు. సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉండటం ఆందోళనకర విషయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క సంవత్సరంలోనే సైబర్ మోసాల కారణంగా సుమారు రూ. 1,300 కోట్ల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయడం, నకిలీ పెట్టుబడి (స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్) ఆఫర్లు, వ్యాపార పెట్టుబడి పేరుతో వచ్చే మోసపూరిత సందేశాలను నమ్మడం వల్ల సైబర్ మోసాలకు గురవుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలను






నియంత్రించడంలో అప్రమత్తతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులందరూ “సైబర్ అంబాసిడర్లుగా” వ్యవహరించి, తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. “సురక్షా కా తిరంగా” సందేశంలోని మూడు రంగులు ప్రజలకు సైబర్ భద్రతపై మూడు ముఖ్యమైన సూచనలను అందిస్తున్నాయని అన్నారు.

- కాషాయం-- అప్రమత్తంగా ఉండండి
- సైబర్ మోసాలు, అనుమానాస్పద ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- తెలుపు-- అవగాహన పెంచుకోండి
- సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత డిజిటల్ లావాదేవీలు చేయండి
- ఆకుపచ్చ-- సురక్షితంగా ఉండండి
- సురక్షితమైన సైబర్ విధానాలను పాటించి, డిజిటల్ భద్రతను కాపాడుకోవాలి.

ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు మరియు ఇతర ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. అనంతరం సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు తదితర సైబర్ నేరాలపై షార్ట్ వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా www.cyber-crime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహనే వాటి నివారణకు అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ డా. సాల్మన్ రెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు, సైబర్ సెల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవికంటే మంచితనమే గొప్పదని చాటిన స్పీకర్




**వికారాబాద్, ఆగస్టు 5 (సింగిడి):** పదవి ఎంత పెద్దదైనా, మనిషి మంచితనం అంతకంటే గొప్పదని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాటారు. బుధవారం బంట్వారం మండలంలో పర్యటనలో భాగంగా ఆయన స్థానికంగా ఉన్న ఓ చాయ్ దుకాణాన్ని సందర్శించి, అక్కడ సాధారణ ప్రజల మధ్య కూర్చొని చాయ్ తాగుతూ కొంతసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న వారు స్పీకర్‌కు ప్రత్యేక కుర్చీ ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన చిరునవ్వుతో స్పందిస్తూ, నేను స్పీకర్ అయినా మీ వాడినే. మీ దగ్గరకు వచ్చినప్పుడు మీరు ఎలా ఉంటారో నేను కూడా మీతో అలానే ఉంటాను మీరు ఎక్కడ కూర్చుంటే నేను అక్కడే కూర్చుంటా అని చెప్పడంతో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి అంటే ప్రజల మధ్య ఉండాలని, పదవితో దూరం కాకూడదనే సందే శాన్ని ఆయన తన ప్రవర్తనతో తెలియజేశారు. ఎలాంటి హడావుడి లేకుండా సాధారణ వ్యక్తిలా చాయ్ తాగిన స్పీకర్ విధానాన్ని అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఈ సంఘటనను చూసిన పలువురు పదవి ఉన్నా గర్వం లేదని ప్రశంసించారు. ప్రజలతో కలిసి మెలిసి ఉండే నాయకత్వం ఇదే అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిరాడంబరతను కొనియాడారు.

# జలసిరిని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి


### జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్ధిపేట బ్యూరో , ఆగస్టు 05(సింగిడి):** భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోతున్న పరిస్థితుల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించేందుకు జలసిరి కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఫార్మ్ పాండ్‌ల నిర్మాణం, భూగర్భ జలాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం రోజున ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఏపీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జలసిరి, శానిటేషన్ డ్రైడే, పాఠశాల విద్యార్థుల యూనిఫార్ముల స్టిచింగ్, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలసిరి కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫార్మ్ పాండ్‌లు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, మ్యాజిక్ సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్లు వంటి నీటి



సంరక్షణ పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో మండల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి లక్ష్య సాధనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల్లో కొత్త బోర్‌వెల్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే శాశ్వత నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలం మొక్కల పెంపకానికి అత్యంత అనుకూల సమయమని పేర్కొన్న కలెక్టర్, హరితహారం లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన మొక్కలను వెంటనే నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సీజనల్ పరిస్థితులు, ప్లాంటేషన్ పనులు, నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని 818 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 62,433 మంది విద్యార్థులకు యూనిఫార్ములు అందించేందుకు 1,073 మంది మహిళా సంఘాల టైలర్ల ద్వారా స్టిచింగ్ పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు యూనిఫార్ములు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వికలాంగ విద్యార్థుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని. విద్యాశాఖ అధికారులు సదరం ధ్రువపత్రాల కోసం విద్యార్థులకు స్లాట్లు బుక్ చేస్తే, వారికి ప్రత్యేక సదరం శిబిరాన్ని నిర్వహించి ధ్రువపత్రాలు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శానిటేషన్ డ్రైడే కార్యక్రమాలను ప్రతి గ్రామంలో సమర్థవంతంగా నిర్వహించి పరిశుభ్రతను తీర్చిదిద్దాలని, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ, రమేష్, రవీందర్,డీఆర్డీఓ సుధీర్, ఏపీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూ యజమానులకు చెక్కులు అందజేత



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 5 (సింగిడి):** సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన అల్వాల్ భూయజమానులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్. బుధవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి 2264 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన అల్వాల్ భూయాజమానులకు డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ 33 కోట్ల రూపాయల పరిహార నిధుల చెక్కును అందజేసారు. అనంతరం ప్రత్యేక భూ సేకరణ అధికారి మాలతి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నఈ ప్రాజెక్టులో భాగంగా అల్వాల్‌లోని స్థలానికి సంబంధించి ఇటీవల జరుగుతున్న అసత్య ప్రచారాలను మరియు తప్పుడు ఆరోపణలను వ్యతిరేకిస్తున్నానన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియలు మరియు రికార్డులను పక్కనబెట్టి, సర్వే నంబరు 168 భూమి పై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార వార్తలను ప్రజలకు చేరవేయకూడదని స్పష్టం చేసారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల డివిజన్ హెచ్ఐఎల్ రాఘవేంద్ర కాలనీలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కు స్థానికులు సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం పూర్ణ శ్రీశైలం గౌడ్ స్థానికులతో మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉషోదయ కాలనీ సంక్షేమ సంఘం ( వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యులు కాలనీలోని పలు సమస్యలపై మర్యాదపూర్వకంగా కలిసి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi గురువారం 6-8-2026

# ఎడిటోరియల్

Editorial

## ఉదయనిధి బరితెగింపు విమర్శలు !

అధికారంలో ఉంటే పెసరం మాటలు..రెచ్చగొట్టే ప్రసంగాలు..సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో,తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేదు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.

## మిస్టర్ ఆసియా బిరుదు పొందిన తొలి తెలుగువాడు దండమూడి

### దండమూడి రాజగోపాలరావు వర్ధంతి

**దండమూడి రాజగోపాలరావు (అక్టోబరు 16, 1916 – ఆగష్టు 6, 1981) భారత దేశ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు. అసామాన బలశాలి, అసాధారణ శక్తి సంపన్నుడు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆయన 'ఆంధ్రభీమ, ఇండియన్ టార్జాన్', ఇండియన్ హెర్క్యులస్, జాయింట్ ఆఫ్ ఇండియన్ బిరుదులను పొందారు. శరీర సౌష్టవ పోటీలో మిస్టర్ ఆసియా బిరుదును పొందిన తొలి ఆంధ్రుడే కాక తొలి భారతీయుడు.**





కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గండిగుంటలో 1916 అక్టోబర్ 14న రైతు కుటుంబంలో జన్మించిన ఆయన కోడి రామ్మూర్తి నాయుని స్ఫూర్తితో బరువులు ఎత్తడంపై ఆసక్తి కలిగి, పెదపారుపూడి మండలం వాన పాములలో వెయిట్‌లిఫ్టింగ్ సాధన ప్రారంభించారు.

1938లో తొలిసారిగా పోటీల్లో పాల్గొని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 1940లో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా గెలుపొందారు. 1943

లండన్ ఒలింపిక్స్ ఆదిగా ... మూడు పర్యాయాలు దేశం పక్షాన విశ్వ క్రీడలకు ప్రాతినిధ్యం వహించారు. 1945లో జాతీయ స్థాయిలో 320 పౌండ్ల బరువు ఎత్తి విజేతగా నిలిచారు. 1948లో కోల్‌కతా వేదికగా జరిగిన ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని... 'మిస్టర్ ఆసియా'గా గుర్తింపు పొందిన తొలి భారతీయుడు, అదీ తెలుగు వారు కావడం విశేషం. అలా 1948లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో పాల్గొన్న తొలి ఆంధ్రుడుగా నిలిచారు. 1945 నుంచి 1958 వరకు 13 ఏళ్లపాటు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌గా గెలుపొందుతూ వచ్చారు.

ఆయన 1951లో ఢిల్లీలో జరిగిన ప్రథమ ఆసియా క్రీడోత్సవాలలో వెయిట్ లిఫ్టింగ్ పురుషుల సూపర్ హెవీ వెయిట్ (ం105 కేజీలు) వర్గములో కాంస్య పతకాన్ని గెలుచు కున్నారు. రాజగోపాలరావు అనేక రాష్ట్రాలు, దేశాలలో ప్రదర్శనలిచ్చారు. తెలుగు రంగస్థల, సినిమా నటుడుగా 1963లో విడుదలైన నర్తనశాల సినిమాలోనూ, 1965లో విడుదలైన వీరాభిమన్యు సినిమాలోనూ, భీముని పాత్ర సమర్థ వంతంగా పోషించారు.

రాష్ట్ర ఒలింపిక్ సంఘం వ్యవస్థాపకుడిగా, వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చాలా ఏళ్లపాటు ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. విజయవాడలో సొంతంగా వ్యాయామశాల నెలకొల్పారు. రాష్ట్ర వ్యాప్తంగా జిమ్‌ల ఏర్పాటుకు కృషి చేశారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో స్థలం విరాళంగా ఇచ్చి... ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కారకులయ్యారు. ఆయన పేరు మీద ఉన్న ఇండోర్ క్రీడా ప్రాంగణానికి "దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియం" అని నామకరణం చేశారు. దాన్ని నాట రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య ప్రారంభించారు. రాజగోపాలరావు 1981, ఆగష్టు 6న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## అణు నిరాయుధీకరణకు అడ్డుగోడ అగ్రరాజ్యాల ద్వంద్వ వైఖరే

అణ్వాయుధాలు మానవాళిని ఎన్నిసార్లైనా నాశనం చేయగల శక్తిని కలిగి ఉన్నాయని ప్రపంచం ఎనిమిది దశాబ్దాల క్రితమే గ్రహించింది. అందుకే రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టేందుకు, ఇప్పటికే ఉన్న ఆయుధాలను తగ్గించేందుకు అనేక అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. అయినప్పటికీ, అణ్వాయుధాలు తగ్గాల్సిన చోట మరింత ఆధునీకరించబడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం సాంకేతిక లోపాలు కాదు. అగ్రరాజ్యాల రాజకీయ ద్వంద్వ వైఖరే.



ప్రపంచ శాంతి, అణ్వాయుధ నిరాయుధీకరణ గురించి అత్యధికంగా మాట్లాడే దేశాల్లో అమెరికా ముందుంటుంది. అయితే దాని మాటలకు, ఆచరణకు మధ్య ఉన్న అంతరమే అంతర్జాతీయ అణు వ్యవస్థపై విశ్వాసాన్ని బలహీనపరిచింది. ఇతర దేశాలు అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తే ప్రపంచ భద్రతకు ముప్పు అని హెచ్చరించే అదే అమెరికా, తన వద్ద వేలాది అణ్వాయుధాలను నిల్వ ఉంచుకోవడాన్ని జాతీయ భద్రత పేరుతో సమర్థించుకుంటుంది. ఇదే ద్వంద్వ ప్రమాణం అనేక దేశాల్లో అసంతృప్తిని పెంచింది.

మానవ చరిత్రలో యుద్ధంలో అణుబాంబును ప్రయోగించిన ఏకైక దేశం అమెరికా. 1945 ఆగస్టు 6న హిరోషిమాపై, ఆగస్టు 9న నాగసాకిపై అణుబాంబులు వేయడంతో లక్షలాది మంది అమాయక పౌరులు తక్షణమే లేదా తరువాత రేడియోధార్మిక వికిరణాల ప్రభావంతో ప్రాణాలు కోల్పోయారు. ఆ విధ్వంసం మానవ నాగరికతకు చెరగని మచ్చగా మిగిలిపోయింది. యుద్ధాన్ని త్వరగా ముగించడానికే ఈ చర్య తీసుకున్నామని అమెరికా అధికారికంగా చెప్పినప్పటికీ, కొందరు ప్రముఖ చరిత్రకారులు దీనిని అప్పటి సోవియట్ యూనియన్‌కు అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శించిన చర్యగా కూడా విశ్లేషిస్తారు. కారణాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నా, అణ్వాయుధాలను యుద్ధంలో ఉపయోగించిన ఏకైక దేశం అమెరికానే అన్నది మాత్రం చారిత్రక సత్యం.

1968లో రూపొందిన అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం ప్రపంచాన్ని రెండు వర్గాలుగా విభజించిందనే విమర్శ మొదటి నుంచే ఉంది. అప్పటికే అణ్వాయుధాలు కలిగిన ఐదు దేశాలకు ప్రత్యేక హోదా కల్పించి, మిగిలిన దేశాలకు మాత్రం పరిమితులు విధించడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని అనేక దేశాలు అభిప్రాయపడ్డాయి.

అణ్వాయుధ దేశాలు నిరాయుధీకరణకు కట్టుబడి ఉంటామని ప్రకటించినప్పటికీ, ఆ దిశగా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయాయి.

ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం అణ్వాయుధాల్లో దాదాపు తొంభై శాతం అమెరికా, రష్యా దేశాల వద్దనే ఉన్నాయి. ఒకవైపు నిరాయుధీకరణ గురించి మాట్లాడుతూనే, మరోవైపు తమ అణ్వాయుధ వ్యవస్థలను ఆధునీకరించడం ప్రపంచానికి విరుద్ధ సంకేతాలను పంపుతోంది. అణ్వాయుధాలు తమకు అవసరమని, ఇతర దేశాలకు మాత్రం అవసరం లేదని పరోక్షంగా చెప్పే ఈ విధానం అంతర్జాతీయ వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది.

అంతర్జాతీయ ఆయుధ నియంత్రణ వ్యవస్థను బలహీనపరిచిన నిర్ణయాల్లో కూడా అమెరికా పాత్ర ప్రస్తావనీయమే. 2002లో క్షిపణి నిరోధక వ్యవస్థల పరిమితి ఒప్పందం నుంచి వైదొలగడం, 2018లో ఇరాన్‌తో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ఒప్పందంను విడిచిపెట్టడం, 2019లో అమెరికా– –రష్యా మధ్య ఉన్న మధ్యశ్రేణి అణు క్షిపణుల నిర్మూలన ఒప్పందం ముగియడానికి దారితీసిన పరిణామాలు ప్రపంచ భద్రతా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపాయి. అదే సమయంలో రష్యాపై కూడా ఈ ఒప్పంద ఉల్లంఘన ఆరోపణలు వచ్చాయి. ఫలితంగా పరస్పర విశ్వాసం మరింత దెబ్బతింది.

ఇరాక్‌పై జరిగిన యుద్ధం అంతర్జాతీయ రాజకీయాల్లో మరో ముఖ్యమైన ఉదాహరణ. వినాశక ఆయుధాలు ఉన్నాయనే ఆరోపణలతో యుద్ధం ప్రారంభమైనప్పటికీ తరువాత అలాంటి ఆయుధాలు కనుగొనబడలేదు. అయినప్పటికీ లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు; ఒక దేశం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. ఈ సంఘటన ప్రపంచవ్యాప్తంగా అమెరికా విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తింది.

లిబియా, ఇరాక్ వంటి దేశాల్లో జరిగిన పరిణామాలు, అలాగే 1994లో అణ్వాయుధాలను వదులుకున్న ఉక్రెయిన్ తరువాత రష్యా దాడులను ఎదుర్కొన్న పరిస్థితి ప్రపంచ భద్రతా వ్యవస్థపై కొత్త సందేహాలను సృష్టించాయి. ఈ పరిణామాలు అంతర్జాతీయ భద్రతా హామీల విశ్వసనీయతపై విస్తృత చర్చకు దారితీశాయి. కొందరు వ్యూహాత్మక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇవి కొన్ని దేశాల్లో అణ్వాయుధాలే అంతిమ రక్షణ అనే భావనను బలపరిచాయి. ఇది అణ్వాయుధ నిరాయుధీకరణ లక్ష్యానికి ఎదురుదెబ్బగా మారింది.

అయితే ఈ సంక్షోభానికి అమెరికా ఒక్కటే కారణమని చెప్పడం సరైంది కాదు. రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా తమ అణ్వాయుధ సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకుంటున్నాయి. అయినప్పటికీ ప్రపంచ రాజకీయాల్లో అత్యధిక ప్రభావం కలిగిన దేశంగా అమెరికాపై నైతిక బాధ్యత మరింత ఎక్కువ. ప్రపంచానికి సూచించే ప్రమాణాలను ముందుగా తానే పాటించినప్పుడే ఆ నాయకత్వానికి విశ్వసనీయత లభిస్తుంది.

ప్రపంచానికి ఇప్పుడు అవసరమైనది కొత్త ఆయుధాల పోటీ కాదు; కొత్త విశ్వాసం. అణ్వాయుధ దేశాలన్నీ "ఏ దేశంపైనా ముందుగా అణ్వాయుధాలను ప్రయోగించము" అనే విధానాన్ని స్వీకరించే దిశగా కదలాలి. అణుశక్తి వినియోగాన్ని పర్యవేక్షించే అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలను మరింత పారదర్శకంగా, వివక్ష లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలి. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలిత వ్యవస్థల ద్వారా అణ్వాయుధాల నియంత్రణ జరగకుండా స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు రూపొందించాలి.

అణ్వాయుధాలు ఏ దేశానికీ శాశ్వత భద్రతను ఇవ్వవు. అవి పరస్పర వినాశనాన్ని మాత్రమే హామీ ఇస్తాయి. అగ్రరాజ్యాలు తమకు ఒక న్యాయం, మిగిలిన ప్రపంచానికి మరో న్యాయం అనే ద్వంద్వ వైఖరిని విడిచిపెట్టి, నిజమైన నిరాయుధీకరణ దిశగా ముందడుగు వేసినప్పుడే అణ్వాయుధ రహిత ప్రపంచం అనే లక్ష్యం వాస్తవ రూపం దాల్చుతుంది.

**డి జె మోహన రావు**
**8247045230**



## సమయానికి రాని ఖని--భూపాలపల్లి బస్సు..

- ప్రయాణికుల తీవ్ర ఆవేదన
- రోజూ 30 నిమిషాల ఆలస్యం..
- డ్రైవర్, కండక్టర్ నుంచి రోజుకో కొత్త సాకు అంటూ ఆరోపణలు



**గోదావరిఖని, ఆగస్టు 5 (సింగిడి):** గోదావరిఖని నుంచి ఉదయం 7 గంటలకు భూపాలపల్లికి బయలుదేరాల్సిన ఆర్టీసీ బస్సు ప్రతిరోజూ సుమారు 30 నిమిషాల ఆలస్యంగా బయలుదేరుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల కథనం ప్రకారం, ఫిర్యాదు చేసిన తర్వాత ఒకటి, రెండు రోజులు మాత్రమే బస్సు సమయానికి నడుస్తుండగా, అనంతరం మళ్లీ యథావిధిగా ఆలస్యంగా బయలుదేరుతోంది. బస్సు ఆలస్యానికి ఒకరోజు కొబ్బరికాయ కొట్టాల్సి వచ్చిందని, మరోరోజు డీజిల్ నింపడంలో ఆలస్యమైందని, ఇంకోరోజు కండక్టర్ ఇంకా రాలేదని ఇలా రోజుకో కొత్త కారణం చెబుతున్నారని వారు ఆరోపించారు. బస్సు ఆలస్యంతో ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లేవారిపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, ఉదయం 7 గంటల బస్సును నిర్ణీత సమయానికే నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాష్ట్ర మంత్రులతో అభివృద్ధిపై కీలక సమీక్షకు మేయర్

- ప్రత్యేక నిధులు, మౌలిక వసతుల విస్తరణపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించనున్న మేయర్



**కరీంనగర్, ఆగస్టు 5(సింగిడి):** కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై ఆగస్టు 6న హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులతో నిర్వహించనున్న ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొననున్నారు. సమావేశంలో నగర మౌలిక వసతుల విస్తరణ, రహదారుల అభివృద్ధి, ఆధునిక మురుగునీటి పారుదల వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వరద నివారణ చర్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పట్టణ సుందరీకరణ, ప్రజలకు మెరుగైన పౌర సేవల కల్పన వంటి అంశాలపై చర్చ జరగనుంది. నగర అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధుల కేటాయింపు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద చేపట్టాల్సిన ప్రాజెక్టులు, కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై రాష్ట్ర మంత్రులకు మేయర్ సమగ్ర నివేదిక సమర్పించనున్నారు. అలాగే నగర అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు, పరిపాలనా సహకారం అందించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో కరీంనగర్‌ను ఆధునిక, సుందర, ప్రజానుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని మేయర్ కార్యాలయం పేర్కొంది.

## కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో గోరింటాకు ఉత్సవం




**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి) :** జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గోరింటాకు పండుగను ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఆషాడ మాసంలో గోరింటాకును ప్రతి మహిళ పెట్టుకుంటుందని ఆ సంస్కృతి మన పురాతన కాలం నుండి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గోరింటాకు తయారు చేసే విధానం దాని వలన కలిగే లాభాలను వివరిస్తూ ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛమైన తాజా మైదాకు ను తీసుకొని వచ్చి పాత పద్ధతిలో రోట్లో వేసి దంచి విద్యార్థులు ఆ మైదాకు ను కాళ్లకు చేతులకు పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. గోరింటాకు ఎంత ఎక్కువ ఎర్రటి రంగు పడితే అంత సౌభాగ్యానికి సూచికగా భావిస్తారని సైన్స్ పరంగా యాషాడ మాసంలో వాతావరణం ఉడకపోతాను వేడిని తగ్గించడానికి ఈ గోరింటాకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయుర్వేద గ్రంధాలు ఈ విషయాన్ని తెలుపుతున్నాయని పేర్కొన్నారు. ఆషాడ మాసంలో అత్తా కోడలు కూడా తమ పుట్టింటికి వెళ్లిన సందర్భంగా అన్నా చెల్లెలు అక్క తమ్ముడు కలిసి ఈ గోరింటాకు వేడుకను తమ కుటుంబ సభ్యులతో ఆనంద ఉత్సవాల మధ్య జరుపుకోవడానికి అవకాశం కల్పించినది అని అన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకొని ఆటపాటలతో ఆనందోత్సవాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పి రాజయ్య పి శ్రీనివాస్ ఏ నరహరి సి రవికాంత్ రాజ్ పి రాజు కే పద్మజ శ్రీను పి కుమారస్వామి పి.వి విజేందర్ రెడ్డి పి శ్రీమాన్ కార్యాలయ సిబ్బంది స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

### ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** విద్యార్థులు ఇష్టపడి బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మంచి ప్రయోజకులుగా ఎదగాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ అన్నారు. బుధవారం కళాశాలలో సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ యాజమాన్యం డా. కె. తిరుపతి, డా. కె. స్వర్ణలత గార్ల సహకారంతో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఈ మధ్యాహ్న భోజన పథకం వరుసగా మూడవ సంవత్సరం కొనసాగించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గత రెండు సంవత్సరాలలో బచ్చు భాస్కర్, శ్రీరామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం డా. రాము, డా. శ్రీవాణి, డా. శ్రీనివాస్, డా. రాణి ల సహకారం అందించారని, వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా క్లాసులలో హాజరు శాతం పెరిగిందనీ, అడ్మిషన్లు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్, అకడమిక్ కో- ఆర్డినేటర్ డా. కె. రాజేంద్రం డా. కె. గణేష్, డా. శామల, డా. కె. మాధవి, కె. ఉమాకిరణ్, వి. కిరణ్ కుమార్, ఎన్. మమత, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎల్. రవిందర్, డా. పి. సుష్మ, డా. పి. రవిప్రకాశ్ రావు, డా. ఎన్. శ్రీనివాస్, ప్రశాంత్, రమేష్, శ్రీకాంత్, సాయికుమార్, అరుణ్ రాజ్, అనూష, డా. పి. స్వప్న, దీనా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కోవర్టు రాజకీయాలు చేస్తే చర్యలు తప్పవు

- ఈటెలతో టచ్‌లో ఉంటే పార్టీని వీడండి..
- "గోపి"లకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వార్నింగ్



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవిస్తూ, లోపాయి కారీగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తొ రహస్య రాజకీయాలు నడుపుతున్న కోవర్టులపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవిస్తూ, లోపాయికారీగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్తో రహస్య రాజకీయాలు నడుపుతున్న కోవర్టులపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కోవర్టు రాజకీయాలకు స్వస్తి చెప్పండి... లేదంటే వెంటనే బీఆర్ఎస్ ను వీడి వెళ్లిపోండి!" అంటూ సొంత పార్టీలోని నమ్మకద్రోహులకు స్పష్టమైన అల్టిమేటం జారీ చేశారు. బుధవారం హుజూరాబాద్లోని కే.సీ. క్యాంప్లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీకి వెన్నుపోటు పొడిచే వారి వైఖరిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**కోవర్టు నేతల జాతకాలు నా దగ్గరే ఉన్నాయి..**

బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉంటూనే రహస్యంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చెట్టాపట్టా లేసుకుని తిరుగుతున్న ద్రోహుల పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు నచ్చని వ్యక్తులతో చేతులు కలిపి తొత్తులుగా మారితే ఎంతటి వారినైనా సహించబోమని హెచ్చరించారు. గతంలో ఈటల రాజేందర్ వెంట వెళ్లి బీజేపీలో చేరిన కార్యకర్తలను బూత్ స్థాయిలో గుర్తించి, వారిని తిరిగి గౌరవంగా గులాబీ గూటికి తీసుకురావాలని పార్టీ నాయకులకు సూచించారు.

**రాబోయేది గులాబీ రాజ్యమే..**

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అంతర్గతంగా నిర్వహించిన సర్వేల్లో కూడా రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ 70కి పైగా స్థానాలు గెలిచి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని తేలిందని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి కట్టుబడి, నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకే హుజూరాబాద్ బీఆర్ఎస్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రత్యర్థి ఈటల భజన చేస్తూ పార్టీకి నష్టం చేకూర్చే 'శకుని' పాత్ర పోషిస్తున్న వారికి గులాబీ దళంలో ఏమాత్రం చోటు లేదని, వెంటనే తమ వైఖరి మార్చుకోకపోతే బహిరంగంగా చర్యలు తీసుకుంటామని కౌశిక్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ జమ్మికుంట హుజురాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్లు తక్కల్లపల్లి రాజేశ్వరరావు గందె రాధిక శ్రీనివాస్ సీనియర్ నాయకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు మాజీ ఎంపీపీ లు సరిగోమ్ముల పావని వెంకటేష్ మునిపట్ల రేణుక తిరుపతిరెడ్డి రాణి సురేందర్ రెడ్డి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట పిఏసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ ఎడవెల్లి కొండల్ రెడ్డి తో పాటు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు సొసైటీ చైర్మన్లు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మతల్లి బోనాల ఉత్సవాలకు సన్నాహాలు

ఆగస్టు 9న బోనాల శోభాయాత్ర, కరపత్రాల ఆవిష్కరణ

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు5(సింగిడి):** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 9న నిర్వహించనున్న పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల కరపత్రాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండుగను భగత్‌నగర్ మున్నూరు కాపు సంఘం ఐకమత్యంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో భగత్‌నగర్‌తో పాటు కరీంనగర్ నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9 (ఆదివారం) ఉదయం 10 గంటలకు బోనాల శోభాయాత్ర ప్రారంభమై భగత్‌నగర్ సీడబ్ల్యూసీ గోదాంలోని పోచమ్మ దేవాలయానికి చేరుకుంటుందని తెలిపారు. అనంతరం పట్టం వేసి బోనాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మెంగని వెంకన్న, తోట వెంకట రాములు, రుద్ర ఆంజనేయులు, గంప ముండయ్య, వంగ సుధాకర్, కర్ర సత్యం, పెంట వీరయ్య, బరిగల తిరుపతి, వాసాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిత్య ఆసుపత్రి సేవలు అభినందనీయం

బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** జమ్మికుంట మండలం మడిపల్లి, సైదాబాద్ గ్రామాల్లో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జమ్మికుంట ఆదిత్య--అమృత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, హనుమకొండ శ్రీలక్ష్మీనరసింహ లూమినస్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు తిరుమల--వెంకటేష్, పుప్పాల రాజారం మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ సంకీర్తన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా మానసిక ఒత్తిడి పెరిగి గుండెపోటు, మెదడు పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్) వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ నడక, వ్యాయామం చేయడం, తగినంత మంచినీరు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. మహిళలు ఆరోగ్య విషయాల్లో మరింత అవగాహనతో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరాల్లో 220 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ పోషకాలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, దాదాపు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, ఉప సర్పంచులు కస్తూరి శ్రీనాథ్, ఉష్కమల్ల తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు అంజిరెడ్డి, అంకుస్, మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, సంపత్ రెడ్డి, రమేష్, భిక్షపతి, రాజేష్, ఆస్పత్రి సిబ్బంది అనిల్ రావు, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, అనూష, శృతి, భారతి, కృష్ణవేణి, ప్రసన్న పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డివి శిఖండి రాజకీయాలు

బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గంలో శిఖండి రాజకీయాలు చేస్తున్నాడని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు తీవ్రంగా దుయ్యబట్టాడు. హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. అనునిత్యం వార్తల్లో ఉండడం కోసం చూస్తాడు తప్ప నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని, ముఖ్యంగా హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని వాటిపైన పోరాడడంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఘోరంగా వైఫల్యం చెందాడని సంపత్ రావు ఆరోపించారు. 2021 లో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కోట్ల రూపాయలు పెట్టి నాయకులను కొనుగోలు చేసిందని, అదే పంథాను ఇప్పుడు కౌశిక్ రెడ్డి ఎంచుకుంటున్నాడని, కానీ ఆనాడు ప్రజలు టిఆర్ఎస్ పార్టీకి ఏరకంగా బుద్ధి చెప్పారో కౌశిక్ రెడ్డి మర్చిపోయినట్టున్నడని సంపత్ రావు చురకంటించారు. ఈ మధ్యకాలంలో హుజురాబాద్ నియోజకవర్గంలో కొన్ని సంస్థలు జరిపిన సర్వేలో కౌశిక్ రెడ్డి (బిఆర్ఎస్ పార్టీ)మూడవ స్థానానికి పడిపోయాడని, ఆ విషయం బిఆర్ఎస్ హైకమాండ్ కు తెలిసిందని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కౌశిక్ రెడ్డికి టికెట్ ఇవ్వడం కూడా కష్టమేనని ఆ విషయం కౌశిక్ రెడ్డికి తెలిసే ఇప్పటి నుండే ప్రత్యామ్నాయ మార్గం ఎన్నుకుంటున్నాడని, అందుకే కాంగ్రెస్ పార్టీ జోలికి వెళ్లడం లేదన్నారు. నియోజకవర్గ ప్రజలను కౌశిక్ రెడ్డి మర్చిపోయాడని ప్రజలు కూడా కౌశిక్ రెడ్డిని మర్చిపోయే రోజులు వస్తున్నాయని తెలిపారు. కౌశిక్ రెడ్డి రాజకీయాలు బంద్ చేసి ప్రజా సమస్యలపై పోరాడాలని సంపత్ రావు హితువు పలికారు. లేదంటే రాబోయే రోజుల్లో కౌశిక్ రెడ్డికి హుజురాబాద్ ప్రజలు రాజకీయ సమాధి కడతారని సంపత్ రావు హెచ్చరించారు.

# "సైబర్ క్రైమ్"పై విద్యార్థులకు అవగాహన సదస్సు

- తెలియని వ్యక్తులు ఓటిపి అడిగితే స్పందించవద్దు
- జమ్మికుంట పట్టణ ఎస్ఐ రవి



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ' అనేది తెలంగాణ పోలీసులు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఆగస్టు నెలలో ప్రారంభించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం బుధవారం రోజున స్థానిక జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాలలో జమ్మికుంట యస్. ఐ. రవి ఆద్వర్యంలో ఈ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ నకిలీ ట్రేడింగ్ యాప్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఆగస్టు నెల పొడవునా పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ పట్ల అప్రమత్తత: పోలీసులు లేదా కేంద్ర సంస్థల పేరుతో వీడియో కాల్స్ చేసి భయపెట్టే డిజిటల్ అరెస్ట్ మోసాల గురించి ప్రత్యేక హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

**ట్రేడింగ్ మోసాలు:**

తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేసే నకిలీ ట్రేడింగ్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీరు మోసపోతే ఏమి చేయాలి? ఒకవేళ మీరు లేదా మీ పరిచయస్తులు ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సంఘటన జరిగిన వెంటనే (గోల్డెన్ హవర్) ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన డబ్బులు రికవరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్ బాబు ఉపాధ్యాయులు రాం. రాజయ్య, కె. రవీందర్ రెడ్డి, యం. శ్రీనివాస్, యం. స్వామి, ప్రభాకర్, స్రవంతి, జ్యోతి, లక్ష్మి, వనజ, పద్మ, హేమలత, శైలజ, త్రివేణి, డి. వరదరాజు, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు కాంగ్రెస్.. ప్రజల గుండెల్లో ప్రణవ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రణవ్





**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తామని, సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన పేద ప్రజలకు ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం రోజున హుజురాబాద్ జమ్మికుంట పట్టణ పరిధిలోని 02,03,04,05,06,07,08,11,10, 24,14,28,15 వార్డుల్లో 22 మంది లబ్ధిదారులకు 08 లక్షల పై చిలుకు విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు భావోద్వేగానికి గురికాగా వారిని ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమం అందించడమే నా బాధ్యత అని, వార్డుల్లో తిరుగుతున్న క్రమంలో పలువురు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, జిల్లా అధికార ప్రతినిధులు, పట్టణ అధ్యక్షుడు రమేష్ మహిళా అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు మొలుగూరి సదయ్య సారంగపాణి దేశిని కోటి పొన్నగంటి మల్లయ్య, వార్డ్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ సూరారం డివిజన్ కు చెందిన ఇద్దరు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను బుధవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కుటుంబసభ్యులకు అందజేశారు. అందులో భాగంగా129 - జీడిమెట్ల డివిజన్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన రాజేంద్రన్ దివ్యాన తండ్రి శ్రీధరన్ రాజేంద్రన్ కు రూ. 2.75 లక్షలు, జీడిమెట్ల డివిజన్ విశ్వకర్మ కాలనీ అశోక్ కుమార్ పండిత్ తండ్రి సీతారామ్ పండిత్ కు రూ. 3.5 లక్షలు మంజూరు కాగా వాటికి సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi గురువారం 06-8-2026

# అంగన్వాడీ కేంద్రాల్లో నిర్లక్ష్యం

- తాళం వేసి దర్శనమిస్తున్న కేంద్రాలు
- పోషకాహారం అందడం లేదని గ్రామస్తుల ఆవేదన
- గ్రామ పంచాయతీ సభలో అధికారుల పర్యవేక్షణపై విమర్శలు








**ఏటూరునాగారం, ఆగస్టు 5 (సింగిడి):** ఏటూరునాగారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై గ్రామస్తులు, మహిళా సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సభలో అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించడం లేదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం అందించాల్సిన పోషకాహారం సకాలంలో అందడం లేదని ఆరోపించారు. గ్రామ స్తుల కథనం ప్రకారం, కొన్ని అంగన్వాడీ కేంద్రాలు తరచూ తాళం వేసి కనిపిస్తుండగా, మరికొన్ని కేంద్రాల్లో ఆయాలు మాత్రమే ఉండి టీచర్లు విధులకు హాజరుకావడం లేదని తెలిపారు. ఒక కేంద్రంలో వారం రోజులుగా టీచర్ విధులకు రాకపోవడంతో ఇద్దరు చిన్నారులతో మాత్రమే కేంద్రం కొనసాగుతోం దని పేర్కొన్నారు. బుధవారం పలు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన మాల సామాజిక న్యాయ వేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ మాట్లాడుతూ, అనేక కేంద్రాల్లో టీచర్లు అందుబా టులో లేరని, కొన్ని కేంద్రాలు పూర్తిగా మూతపడి ఉన్నాయని ఆరోపించారు. పాప్కాపురం గ్రామ అంగ న్వాడీ కేంద్రంలో టీచర్, ఆయా ఇద్దరూ అందు బాటులో లేకపోవడంతో కేంద్రం పనిచేయడం లేదని స్థానికులు తెలిపినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రా ల్లో చిన్నారులకు వేడి భోజనం, గుడ్లు, పాలు, ఇతర పోషకాహార పదార్థాలు, అలాగే గర్భిణీలు, బాలింత లకు ప్రభుత్వం అందించే పోషకాహార సరఫరా సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ కార్యాల యంలో అధికారులు అందుబాటులో లేకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉండడం, అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహి స్తున్నారని గ్రామస్తులు విమర్శించారు. తల్లిపాల వారోత్సవాలు వంటి కార్యక్రమాలు కూడా కేవలం ఫోటోలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. అంగన్వాడీ వ్యవస్థలో గతంలో జరిగిన పదోన్నతులు, బదిలీలపై కూడా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్ కొన్ని అక్రమ నియామకాలు, బదిలీలను రద్దు చేసినప్పటికీ, అనంతరం నిబంధ నలకు విరుద్ధంగా పదోన్నతులు, బదిలీలు జరిగాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అంగన్వాడీ సేవలను మెరుగుపరచాలని పలుమార్లు ఆదేశించి నప్పటికీ, వాటి అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిం చారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై జిల్లా యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకో వాలని, ప్రతి కేంద్రం ప్రతిరోజూ సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టరేట్‌కు పకడ్బందీగా కార్యాలయాల తరలింపు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 5(సింగిడి):** నూతన జిల్లా కలెక్టరేట్ భవనానికి కార్యాలయాల తరలింపు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఫైళ్లు, ఫర్నిచర్, కంప్యూటర్లు తదితర సామగ్రి దెబ్బతినకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సాయంత్రం నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, వివిధ శాఖల కార్యాలయాలు, అధికారుల ఛాంబర్లు, అదనపు కలెక్టర్ల కార్యాలయాలు, సమావేశ మందిరాలు, వీవీఐపీ గదుల ఏర్పాట్లను సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి బ్లాక్‌లో ఏ శాఖ పనిచేయనుందో స్పష్టంగా కనిపించేలా ప్రణాళిక రూపొందించాలని, ఉద్యోగుల వివరాలకు అనుగుణంగా కూర్చునే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనుబంధ శాఖలను ఒకేచోట ఏర్పాటు చేసి సమన్వయం సులభతరం చేయాలని సూచించారు. విద్యుదీకరణ, శీతలీకరణ యంత్రాలు, ఫర్నిచర్, తెరలు, తాగునీటి సౌకర్యం, టీ–ఫైబర్ అనుసంధానం, సమావేశ మందిరం, వీవీఐపీ సమావేశాల ఏర్పాట్లు సహా అన్ని మౌలిక వసతులు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు అనుకూలంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యాలయాల తరలింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి నూతన కలెక్టరేట్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, ఏవో సుధాకర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్, ఆర్ అండ్ బీ ఈఈ కుమారస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## యువ నేతపై ప్రజల్లో పెరుగుతున్న క్రేజ్

సమస్యలు వింటూ.. మహిళలతో మాటా మంతి..

"ప్రణవ్" పలకరింపుతో పులకించిన మహిళలు



**జమ్మికుంట, ఆగస్టు 6 (సింగిడి):** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధి దారులకు అందిస్తున్న సమయంలో జమ్మికుంటకు వచ్చిన హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ను చూసి మహిళలు ఆప్యాయతతో పలకరించారు. మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో ప్రణవ్ పర్యటిస్తున్న సమయంలో ఆయనతో పలువురు మహిళలు ఆప్యాయంగా మాట్లాడారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఓపికతో వారి సమస్యలను విని తప్పకుండా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయని వారు సమాధానం తెలపడంతో భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు మీకోసం ప్రభుత్వం అందిస్తుందని స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని వారికి సూచించారు. ప్రణవ్ బాబు చెక్కులు పంపిణీ చేస్తున్న సమయంలో మహిళలు యువకులు ఆయనతో ఆప్యాయంగా మాట్లాడుతూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయతతో పలకరిస్తూ ప్రణవ్ బాబు వారి సమస్యలు వింటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎగ్గని శ్రీనివాస్ మొలుగూరి సదయ్య డిడి రాము పొన్నగంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో హామీలు అమలేదీ?

సెప్టెంబర్ 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమం

పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్



**మహాముత్తారం, ఆగస్టు 5 (సింగిడి):** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పీఆర్టీయూటీఎస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ హెచ్చరించారు. మహాముత్తారం మండలంలోని ములుగుపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల, కొర్లకుంట యూపీఎస్, దొబ్బలపాడు మోడల్ స్కూల్, మహాముత్తారం, నిమ్మగూడెం, యామన్‌పల్లి కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు భుక్య రవినాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూటీఎస్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ సంఘంలో సభ్యత్వం స్వీకరించి ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తోందని తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అలాగే కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా అన్ని సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరు నెలలకొకసారి ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం సరికాదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని మంచి ఫిట్‌మెంట్‌తో ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, హెచ్ఎంఏ సురేందర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, మండల నాయకులు కొంకల గీతారెడ్డి, చైతన్య నాగరాజు, సతీష్‌కుమార్, షరీఫ్, సుధాకర్‌రెడ్డి, లావుడ్య ప్రకాష్‌తో పాటు జిల్లా, మండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వివాదాలకు రాజీమార్గమే శాశ్వత పరిష్కారం

గ్రామాల్లో విస్తృత న్యాయ అవగాహన సదస్సులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 5 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొంపెల్లి, తండా, గొర్లవీడు, ఆన్ సాన్‌పల్లి గ్రామాల్లో మొబైల్ న్యాయ అవగాహన వ్యాన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ మాట్లాడుతూ, కోర్టు కేసుల్లో చిక్కుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు, న్యాయ సహాయం పొందలేని నిస్సహాయులు, కుటుంబ, సివిల్, ప్రామిసరీ నోట్ తదితర వివాదాల్లో ఉన్నవారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ, టోల్‌ఫ్రీ నంబర్ 15100 ద్వారా కూడా సేవలు పొందవచ్చని వివరించారు. సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూ, చిన్నచిన్న వివాదాలను కోర్టుల వరకు తీసుకెళ్లకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో సోదరభావంతో కలిసిమెలిసి జీవించడం వల్ల సామాజిక ఐక్యత బలోపేతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కొంపెల్లి సర్పంచ్ సడాలా శ్రీకాంత్, ఉపసర్పంచ్ మర్రి శ్రీనివాస్, తండా సర్పంచ్ పాల్తీయా నిర్మల--సతీష్, ఉపసర్పంచ్ గుగులోత్ వాలు నాయక్, గొర్లవీడు సర్పంచ్ లావణ్య సాగర్ రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, కె. వెంకటేష్, ఎం. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ భాస్కర్

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 5 (సింగిడి):** పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు రామ్ రెడ్డి లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. మధుకర్ స్వామి (డీసీపీ) సారథ్యంలో రాష్ట్ర పోలీసు శాఖలో సబ్–ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లైన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు అర్హులైన అభ్యర్థులు నేటినుండి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్ పేజీ, యూట్యూబ్ ఛానల్, టెలిగ్రామ్ గ్రూప్ లేదా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా సమర్పించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఆగస్టు 12వ తేదీ రాత్రి 9:00 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఆగస్టు 16వ తేదీ ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 పరీక్షా కేంద్రాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభ్యర్థులకు వనపర్తి పరీక్షా కేంద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన 300 మంది అభ్యర్థులకు నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ క్యాంపస్‌లో పూర్తిగా ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ శిక్షణ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పోలీసు నియామక ప్రక్రియలోని మెయిన్ పరీక్ష వరకు నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్– 9542433427 కు సంప్రదించాలని కోరారు.

## క్రమశిక్షణకు మారుపేరు శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం

- విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి
- పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయాన్ని బుధవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, క్రమశిక్షణకు మారుపేరు శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం అని ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థితిలో ఉన్నారని విద్యతో పాటు క్రమశిక్షణను అందించడం శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయానికి సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు అధ్యాపకులు చెప్పిన పాఠాలను వింటూ క్రమశిక్షణతో ఉండాలని ఎదుటి వ్యక్తులకు గౌరవం ఇస్తూ పాఠశాల సిద్ధాంతాలను గౌరవించాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ, మీకు సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలపాలని పరిష్కారం కాకపోతే మీ తల్లిదండ్రులకు తెలుపుతూ మా దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ క్రమశిక్షణకు మారు పేరైన ఈ పాఠశాలకు ఎలాంటి చెడు పేరు తీసుకురాకుండా నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు వెళ్లాలని సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాతకాల అనిల్ శంకర్ విద్యార్థి సంఘ నాయకులు కొమ్ము నరేష్ శ్రీనివాస్ అనిల్ కౌశిక్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలకు అప్రమత్తతే అస్త్రం

మోసానికి 1930కు ఫిర్యాదు చేయండి

కేటీపీపీ ఉద్యోగులకు సైబర్‌పై సూచనలు

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 5 (సింగిడి):** డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు కొత్త రూపాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనపూర్ మండలం చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)లో "సురక్షా కా తిరంగా" కార్యక్రమం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్, కేవైసీ అప్‌డేట్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్స్, క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరమన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా ఝఝఝ.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. తక్షణ చర్యలతో మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. లోన్ యాప్స్ ద్వారా రుణాలు తీసుకోవద్దని, బ్యాంకుల ద్వారానే రుణాలు పొందాలని, అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టాలని ప్రలోభపెట్టే వ్యక్తులను నమ్మవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఇన్‌చార్జి సీఈ కోటేశ్వరరావు, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, ఘనపూర్ సీఐ కర్ణాకర్ రావు, కేటీపీపీ అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, ఆగస్టు 5 (సింగిడి):** ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మోమిన్ పేట మండలంలో 75 వార్డుల్లో స్పెషల్ ఇంసెంటివ్ రివిజన్ ఇంటింటి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. కుటుంబంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు ఎన్ని ఫరాలు ఇచ్చారు కుటుంబ సభ్యులు ఒకే పీఎస్ లో ఉన్నారా, లేదా అని కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. బి ఎల్ ఓ లు ఎన్నిమినరేషన్ ఫారాలు ప్రతి ఇంటికి తిరిగి అందించాలని, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉర్దూ భాష మాట్లాడే ప్రజలు నివాసం ఉన్నచోట వృద్ధ ఫలాలు వారికి అందజేయాలని, లాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, అర్థవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. రేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని కలెక్టర్ అన్నారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వంటకాలను, కిచెన్ షెడు, ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన రుచిక రమైన భోజనాన్ని అందించాలని పాఠశాల పరిసరాలు, పరిశు భ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని . అధికారులకు కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు వైద్యులు అందు బాటులో ఉండి, నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు అంకిత భావంతో పనిచేయాలని, అలాగే ఆసుపత్రిలో మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి నిర్వహణ ఎలా ఉంది, సేవలు ఎలా ఉన్నాయని ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది హాజరు పట్టిక ఇన్ పేషెంట్ వార్డు, వార్డు గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీరుద్దీన్, సివిల్ సర్జన్ బుచ్చిబాబు, ఎంపీడీవో రాజ మల్లయ్య, సర్పంచ్ సంధ్యా సుభాష్ గౌడ్, బి ఎల్ వోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పవర్‌ఫుల్ డిటాక్స్ డ్రింక్!



ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డిటాక్స్ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో దాల్చినచెక్క, తేనె డిటాక్స్ డ్రింక్ ఒకటి.. దీనిని దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ రసంతో సులభంగా తయారుచేసుకోవచ్చు. ఈ ఆరోగ్యకరమైన పానీయం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దాల్చినచెక్క-తేనె డిటాక్స్ డ్రింక్.. యాంటీఆక్సిడెంట్లు (పాలిఫెనాల్స్), సిన్నమాల్డిహైడ్ (దాల్చినచెక్కలో), ఫినోలిక్ సమ్మేళనాల (తేనెలో) గొప్ప మూలం.. ఇది జీవక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం, వాపును తగ్గించడం, బరువు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు.



**దాల్చిన చెక్క తేనె డిటాక్స్ డ్రింక్‌కు కావలసిన పదార్థాలు:**
**దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ, నీరు..**

**తయారీ విధానం:**

సిన్నమన్ హనీ డిటాక్స్ తయారుచేయడం చాలా సులభం. ముందుగా, ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని పొయ్యి మీద పెట్టి బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, దానికి తగినంత దాల్చిన చెక్క పొడిని కలపాలి. నీటి పరిమాణం, దాల్చిన చెక్క ఘాటును బట్టి పొడిని సర్దుబాటు చేసుకోవాలి. దాల్చిన చెక్క పొడి వేసిన తర్వాత మరికొద్దిసేపు మరిగించాలి. అప్పుడే దాల్చిన చెక్కలోని పోషకాలు నీటిలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని ఒక గ్లాసులోకి వడకట్టుకోవాలి. చివరగా, దానికి కొద్దిగా నిమ్మకాయ రసం, ఒక స్పూన్ తేనెను కలిపి బాగా కలుపుకుంటే వేడివేడి సిన్నమన్ హనీ డిటాక్స్ సిద్ధం అవుతుంది. నిమ్మకాయ, తేనె దాల్చిన చెక్క ఘాటైన రుచిని సమతుల్యం చేస్తాయి.

## ఎప్పుడు తీసుకోవాలి?

ఈ డిటాక్స్ పానీయాన్ని ఉదయం పూట తీసుకోవడం ఉత్తమం. చాలా మంది ఉదయం టీ లేదా గ్రీన్ టీ తీసుకుంటారు. దాని స్థానంలో ఈ సిన్నమన్ హనీ డిటాక్స్‌ను తీసుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో ఉన్నప్పుడు, రోజులో అనేక రకాల డిటాక్స్ టీలను ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది.. అందులో ఇది ఒక రకం. డిటాక్స్ సమయంలో పాలు కలిపిన టీలను నివారించాలి. కాబట్టి పాల బదులు నీటితో తయారుచేసిన ఈ డిటాక్స్ పానీయం అనుకూలంగా ఉంటుంది.

దాల్చిన చెక్క కొద్దిగా ఘాటుగా ఉంటుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్సర్ తీవ్రతను బట్టి, వారు దీనిని తక్కువ మోతాదులో లేదా అప్పుడప్పుడు (రెండు, మూడు రోజులకు ఒకసారి) తీసుకోవాలి. అల్సర్స్ తీవ్రంగా ఉన్నవారు ఈ పానీయాన్ని పూర్తిగా

### ఎన్నో పోషకాలు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

దాల్చిన చెక్క, తేనె, నిమ్మకాయల కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ డిటాక్స్ పానీయం శరీరంలోని టాక్సిన్స్‌ను సమర్థవంతంగా తొలగిస్తుంది.. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది.. శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

# మౌత్ వాష్ వాడటం వల్ల బీపీ,డయాబెటిస్ సమస్యలు వస్తాయా?

## హార్వర్డ్ వర్సిటీ స్టడీ ఏం చెబుతోందంటే..?

**ప్రతి ఒక్కరు ఉదయం లేచాక పళ్ళు తోముకోవడం అనేది సాధారణ పరిశుభ్రతా అలవాటు. కానీ కొంతమంది పళ్ళను 10-15 నిమిషాలు రుద్దుతూ, అంతేకాకుండా మౌత్ వాష్ కూడా తరచుగా వాడతారు.ఇవి సోషల్ మీడియాలో ప్రోత్సహించే అలవాట్లుగా మారాయి.**



మనకు రోజుకు రెండు సార్లు పళ్ళు తోముకోవాలని సిఫార్సు చేస్తారు. కానీ, ఎక్కువ మౌత్ వాష్ వాడటం వల్ల కొన్ని సమస్యలు తలెత్తవచ్చని పరిశోధనలు చూపిస్తున్నాయి. నోటిలో మనకు సహాయపడే "మంచి బ్యాక్టీరియా" ఉంటాయి, ఇవి ఆహారంలోని నైట్రేట్లను నైట్రిక్ ఆక్సైడ్‌గా మార్చడానికి సహాయపడతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను విశ్రాంతి తీసుకోవడానికి, రక్తపోటును నియంత్రించడానికి కీలకమైనది.

**మంచి బ్యాక్టీరియా చనిపోయి..**

తరచుగా యాంటీ-బ్యాక్టీరియల్ మౌత్ వాష్ వాడడం వల్ల ఈ మంచి బ్యాక్టీరియా చనిపోతాయి. ఫలితంగా, అధిక రక్తపోటు, మధుమేహం (డయాబెటిస్) వచ్చే అవకాశం పెరుగుతుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం దాదాపు 1,000 మందిని మూడు సంవత్సరాల పాటు పరిశీలించిన ఒక అధ్యయనంలో, రోజుకు రెండు సార్లు మౌత్ వాష్ వాడిన వారికి ప్రీడయాబెటిస్ లేదా డయాబెటిస్ వచ్చే ప్రమాదం 55% ఎక్కువగా ఉన్నట్టు తేలింది. మరొక పరిశోధనలో, అదే అలవాటు ఉన్నవారికి అధిక రక్తపోటు ప్రమాదం రెట్టింపు అయినట్లు కనుగొన్నారు.

**ఏది ప్రయోజనం..?**

ముఖ్యంగా, క్లోర్‌హెక్సిడైన్ వంటి బలమైన యాంటీ-బ్యాక్టీరియల్ మౌత్ వాష్‌లు వైద్య సలహా మేరకు మాత్రమే వాడాలి. సాధారణ ఫ్లోరైడ్ మౌత్ వాష్ లేదా బెటాడిన్ మౌత్ వాష్ రోజూ ఉపయోగించవచ్చు; ఇవి మంచి బ్యాక్టీరియాకు హాని చేయవు. తదుపరి సూచనల ప్రకారం, నోటిని శుభ్రం చేయడానికి.. రోజుకు రెండు సార్లు పళ్ళు తోమడం, ఫ్లాసింగ్ చేయడం, మౌత్ వాష్‌ను వైద్య సూచనల ప్రకారం మాత్రమే వాడడం.. ఈ మూడు అలవాట్లతో నోటి పరిశుభ్రతను రక్షించడం, అలాగే హృదయ ఆరోగ్యం, రక్తపోటు, మధుమేహ నియంత్రణలో సహాయపడుతుంది.



# సెప్టెంబర్‌లో NSE రూ. 30,000 కోట్ల ఐపీఓ






**ఢిల్లీ:** ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తొలి పబ్లిక్ ఇష్యూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. మొత్తం రూ. 30వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు రూ. 5 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు రానుంది. పబ్లిక్ ఇష్యూకు సంబంధించి ఎన్ఎస్ఈ త్వరలో రోడ్‌షోలు నిర్వహించనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే స్టాక్ మార్కెట్ చరిత్రలో అతి పెద్ద ఐపీఓగా నిలవనుంది. 2024 అక్టోబర్‌లో వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓనే (రూ. 27,870 కోట్లు) అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది.

ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిర్వహించనున్నారు. అంటే ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను వదులుకోనున్నారు. సుమారు 6 శాతానికి సమానమైన 14.80 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంఎస్ స్ట్రాటిజిక్ (మారిషస్) లిమిటెడ్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అరండ ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్), బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు తమ వాటాలు విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో అతి పెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ మాత్రం పబ్లిక్ ఇష్యూలో తన వాటాలను విక్రయించడం లేదు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఈ సంస్థకు 10.72 శాతం వాటా ఉంది.

**దశాబ్దం కల నెరవేరుతున్నవేళ**

ఎన్ఎస్ఈ ఐపీఓ దాదాపు దశాబ్దం క్రితమే రావాల్సింది. 2016లో రూ. 10వేల కోట్లు సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. గవర్నెన్స్ సమస్యలు, కోలొకేషన్ వ్యవహారం తెరపైకి రావడంతో సెబీ రెడ్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అడ్డంకులను తొలగించుకుంటూ వచ్చింది. నియంత్రణ సంస్థ నుంచి ఆమోదం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసింది. ఈ క్రమంలోనే సెబీ నుంచి ఎన్వోసీ రావడంతో ఐపీఓకు ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా 20 మంది మర్చంట్ బ్యాంకర్లను నియమించింది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా జియో ప్లాట్‌ఫామ్ పేరిట అతిపెద్ద ఐపీఓకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది.

# ఫ్రీ ట్రయల్ ఫ్రీ కాదు గురూ.. మరి మ్యాండేట్ డిలీట్ చేయడం ఎలా?



యాప్‌లో కొత్త ఫీచర్ వచ్చింది.. నెల రోజులు ఫ్రీ ట్రయల్.. ఇప్పుడే సబ్‌స్క్రైబ్ చేసుకోండి. మా ఓటీటీలో కొత్తగా యాడ్‌ఫ్రీ సేవలు తీసుకొచ్చాం.. ఓ రెండు నెలలు ఉచితంగా వాడాక పేమెంట్ చేయండి.. అంటూ రకరకాల సేవలు మనల్ని ఊరిస్తుంటాయి. చాలా కంపెనీలు తమ ప్రీమియం సేవలవైపు యూజర్లను ఆకర్షించేందుకు వేసే ఎత్తుగడే ఈ ఫ్రీ ట్రయల్. ఎలాగూ ఉచితమేగానని చాలామంది సబ్‌స్క్రైబ్ అవుతుంటారు.

ప్రీమియం సేవల కోసమే తీసుకునే వారికి.. ఈ ఫ్రీ ట్రయల్ ఓ విధంగా కలిసొచ్చినట్లే. కానీ, ఉచితకాలం ముగిశాక ఆపేద్దామనుకున్న వారు మాత్రం ఇరుక్కుపోతుంటారు. సబ్‌స్క్రైబ్ చేసుకున్నాక చాలా మంది దాని సంగతి మరిచిపోతుంటారు. తీరా బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాక నాలుక కరుచుకుంటారు. మరికొందరు మాత్రం ఫ్రీ ట్రయల్ రద్దు చేయడం తెలీక తాము వాడని సేవలకూ నెల నెలా డబ్బులు చెల్లిస్తుంటారు. దీనివల్ల నగదు కోల్పోవడమే కాదు.. అకౌంట్‌లో డబ్బులు లేకపోతే ఆటోపే మ్యాండేట్ ఫెయిల్ అయి బ్యాంకులు అపరాధ రుసుం విధించొచ్చు. దీనివల్ల క్రెడిట్ స్కోరుపైనా ప్రభావం పడుతుంది.

**ఆటోపే మ్యాండేట్ తెలుసుకోవడం ఎలా?**


చాలా మంది దగ్గర తమ స్మార్ట్‌ఫోన్లలో ఒకటికి మించి యూపీఐ యాప్స్ ఉంటాయి. ఏదైనా ఫ్రీ ట్రయల్‌కు సబ్‌స్క్రైబ్ అయినప్పుడు ఏదో ఒక యాప్ నుంచి ఆటో డెబిట్‌కు అంగీకారం తెలుపుతూ అనుమతి ఇచ్చేస్తుంటారు. రెండు మూడుకు మించి ఇలాంటి అనుమతులు ఇచ్చినప్పుడు ఏ యాప్‌లో ఏది ఉందో తెలుసుకోవడమూ కష్టమే. అలాంటి వారి కోసమే ఒక మొబైల్ నంబర్‌పై ఎన్ని మ్యాండేట్‌లు ఉన్నాయో తెలుసుకోవడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఓ సదుపాయం కల్పిస్తోంది. https://upihelp.npci.org.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ మొబైల్ నంబర్‌పై ఎన్ని ఆటోపేకి అనుమతులు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వగానే అన్నీ ఒకే చోట దర్శనమిస్తాయి. కావాలంటే అక్కడే పాజ్ చేయొచ్చు. లేదంటే పూర్తిగా క్యాన్సిల్ చేయొచ్చు. యాప్‌లోనూ రద్దు చేసుకునే సదుపాయం ఉంది.

**ఒక్కో యాప్‌లో ఒక్కోలా**

ఒకవేళ మీరు ఫోన్‌పే వాడుతుంటే.. ప్రొఫైల్ పిక్చర్ మీద క్లిక్ చేసి పేమెంట్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఆటోపే ఆప్షన్ ఎంచుకుని కావాల్సిన మ్యాండేట్‌ను తొలగించొచ్చు. పేటీఎంలో అయితే ప్రొఫైల్ మెనూలోకి వెళ్లి యూపీఐ/పేమెంట్ సెట్టింగ్స్‌లో యూపీఐ ఆటోమేటిక్ పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. గూగుల్ పేలో ప్రొఫైల్ ఐకాన్ క్లిక్ చేసి అందులో నేరుగా ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఒకవేళ భీమ్ యాప్ యూపీఐ వాడుతుంటే.. మ్యాండేట్స్ లేదా ఆటోపే సెక్షన్‌లోకి వెళ్లి యూపీఐ పిన్ ఎంటర్ చేసి ఇంతకుముందు ఆటోడెబిట్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయొచ్చు.

నాలుగో రోజు లాభాల్లోనే..

## సెన్సెక్స్ 521 పాయింట్లు పైకి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి . చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, క్యూ1 ఫలితాలపై ఆశావహ దృక్పథం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,400 పాయింట్ల పైకి ఎగబాకింది.

నిఫ్టీ 159.50 పాయింట్ల లాభంతో 24,430.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, రిలయన్స్, ఐసీఐసీఐ, మారుతీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. కోటక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.38గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,148.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ముందే 9 లక్షలు నిధులు మంజూరు!

సంవత్సరాలు గడుస్తున్న వికలాంగుల భవనం



**వెల్దుర్తి, (సింగిడి):** మాసాయిపేట మండల కేంద్రంలో గత సంవత్సరాల తరబడి నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వికలాంగుల విద్యా భవనం పనులు చేసి మధ్యలో ఆపారు . అనంతరం ముందుగానే నిధులు తొమ్మిది లక్షలు జిల్లా అధికారులు మంజూరు చేసినారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యానికి ఇప్పటికీ భవనం పూర్తి కాకపోవడంతో వికలాంగుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అదేవిధంగా భవనం చుట్టూ ఎలాంటి పరిశుభ్రత పాటించకపోవడం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కనబడుతుంది ఇప్పటికైనా మాసాయిపేట మండలం అభివృద్ధి విషయంలో ఎంతోమంది ప్రజా ప్రతినిధులు మాట్లాడుతారు అని అన్నారు అనంతరం వికలాంగుల భవనం నిధులు కూడా ముందే మంజూరు చేయడం ఆచార్యానికి గురిచేస్తుంది కానీ ఎందుకు నిధులు ఉన్న భవనం పూర్తి చేయకపోవడం అంతర్యమైంది అని గుసగుసలు వినబడుతున్నాయి జిల్లా అధికారులు కాంట్రాక్టర్లులను వివరాలు అడిగి ఎందుకు నత్త నడక పనులు నడుస్తున్నాయని తెలుసుకోవాలని వికలాంగుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు వికలాంగుల విద్యాభ్యాస భవనం నూతన మధ్యలో నిలిపివేశారు

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె

కొత్తగూడెం భారీ ర్యాలీని విజయవంతం చేయండి..

ఆదివాసీ సంఘాలు పిలుపు..



**దమ్మపేట, (సింగిడి):** ఈ నేల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు ప్రత్యేక కరపత్రాలను స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు ప్రతి గూడెంలోనూ ఆదివాసి జెండాను ఎగురవేసి, జాతి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులను, చట్టాలను రక్షించుకోవడానికి బలమైన ఉద్యమాలు నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఆగస్టు 9న జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో భారీ సాంస్కృతిక ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క ఆదివాసి సోదరుడు హాజరై, సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకులు కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సర్పంచ్‌లతో టీఎస్ఎన్‌పీడీసీఎల్ డీఈ హర్జీ నాయక్ సమీక్ష.



**నల్లబెల్లి, (సింగిడి):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) జాటోత్ హర్జీ నాయక్ సూచించారు. మంగళవారం నల్లబెల్లి ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ఒక్కో సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్న ఆయన, ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు, విద్యుత్ లైన్లు, స్తంభాల మరమ్మతులు, లో-వోల్టేజ్ వంటి సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. వర్షాలు, గాలుల కారణంగా ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి లోపాలు తలెత్తినా వెంటనే స్పందించి ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలనిసూచించారు. గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని డీఈ హామీ ఇచ్చారు. ప్రజలు కూడా విద్యుత్ భద్రతా నియమాలను పాటిస్తూ, ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలనిసూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అటవీ జంతువుల వేట కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



**తల్లాడ, (సింగిడి):** తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లూరు సెక్షన్‌లో ఇటీవల అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఎలుగుబంటిని హతమార్చిన కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను అటవీ శాఖ అధికారులు సోమవారం మధ్యాహ్నం చాకచక్యంగా అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించిన విషయం విదితమే. ఈ కేసులో పరారీలో ఉన్న అజ్మీర కృష్ణ (కొత్తబోడు మల్లె గ్రామం) ఏనుగంటి రామకృష్ణ (లోకారం గ్రామం) కోసం తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి ఉమా ఆధ్వర్యంలో ప్రత్యేక రెక్కీనిర్వహించి,మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం 11 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఖమ్మం జిల్లా కారాగారానికి తరలించారు. ఈ సందర్భంగా తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి ఉమా మాట్లాడుతూ, అటవీ నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, అటవీ మరియు వన్యప్రాణి సంరక్షణ చట్టాల ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవుల్లో అక్రమ వేట, విద్యుత్ తీగల ఏర్పాటు వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి. సురేష్ కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, రమేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (కోర్టు డ్యూటీ), నక్క రమేష్, అజమ్ అలీ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్), తెనాలి శీను, తేజావత్ కృష్ణ, అంజద్ పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సేవలకు శాశ్వత గుర్తింపు ఇవ్వాలి

కేయూజేఏసీ నేతల డిమాండ్

**నల్లబెల్లి, (సింగిడి):** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కాకతీయ విశ్వవిద్యాలయ జేఏసీ (కేయూ జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఐదో రోజు సంతాప కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన అనంతరం కేయూజేఏసీ చైర్మన్ డా. సాదు రాజేష్, ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, కేయూ పాలక మండలి సభ్యులు డా. చిర్రా రాజు, జేఏసీ నాయకుడు జోరిక రమేష్ మీడియాతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనే కాకుండా ప్రజాప్రతినిధిగా నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది సుదర్శన్ రెడ్డి విశేష కృషి చేశారనికొనియాడారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని కోరారు. నర్సంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు నామకరణం చేయాలని, వరంగల్‌లో ప్రతిపాదిత నూతన విమానాశ్రయానికి కూడా ఆయన పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. పాకాల చెరువు బండ్‌పై పెద్ది సుదర్శన్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ ఉద్యమానికి



ఆయన చేసిన సేవలను చిరస్థాయిగా నిలిపే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పెద్ది కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటూ రూ. 10 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని, ఈ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఫిరోజ్ పాషా, డా. వి.ఎస్. యాకుబ్ రెడ్డి, నలిగంటి శరత్, డా. భైరపాక ప్రశాంత్, లంక రాజగోపాల్, రామూర్తి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటిపన్ను వసూలు నిలిపివేయాలని కోరుతూ ధర్నా

మూడేళ్ల పెండింగ్ నీటి బిల్లు వసూలు చేస్తున్న వైరా మున్సిపల్ సిబ్బంది

కౌన్సిల్ సమావేశం లేకుండా. ఆన్లైన్ బిల్లులు ఇవ్వకుండా మాన్యువల్ బిల్లు ఇవ్వడం పై ధర్నాలో

పాల్గొన్న కౌన్సిలర్లు, బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు

**వైరా, (సింగిడి):** వైరా మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా వసూలు చేస్తున్న మంచినీటి పన్నుల బకాయిలు ఎలాంటి తీర్మానం లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.. ఈ సందర్భంగా మున్సిపల్ బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి, తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, మాదినేని సునీత దుర్గాప్రసాద్, నల్లమోతు శైలజ, జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున రావు, బాణాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడిన దగ్గర్నుండి సుమారు 8 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంచినీటి పన్నుల వసూళ్లు జరగలేదని, వైరా మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది మూడు సంవత్సరాల బిల్లును ఒకేసారి వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతున్నారని దీన్ని అరికట్టేందుకు మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి ఆన్లైన్ బిల్లులు లేకుండా కేవలం ఆఫ్ లైన్ బిల్లుల ద్వారా బిల్లులు వసూలు చేయటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం కౌన్సిల్ తీర్మానం లేకుండా త్రాగునీటి బిల్లులు ఎలా వసూలు చేస్తారని కమిషనర్ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఆన్లైన్ బిల్లులు వచ్చేవరకు సిబ్బంది తాగునీటి బిల్లులు వసూలు తాత్కారికంగా నిలిపివేస్తామని హామీ ఇచ్చారు.



వారం రోజుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం ప్రతిపాదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు మద్దెల రవి, అప్పం సురేష్, మహిళా మాజీ అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, పుల్లయ్య, పాసంగులపాటి శివ, బత్తులరాజు,కొత్త నరసింహారావు, మాచర్ల శంకర్, నరసింహారావు, కట్ట నాగేశ్వరరావు,వేముల శివకృష్ణ, రంజాన్, వజినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వీరన్న, రేచర్ల సైదులు, వల్లెపు రాము తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను అడ్డుపెట్టి తప్పుడు కేసులు పెట్టడం సరికాదు

– బీఆర్ఎస్ నాయకులు



**గుండాల, (సింగిడి)::** మహిళలను అడ్డుపెట్టి రాజకీయ ప్రత్యర్థులపై కేసులు నమోదు చేయించడం నీచమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, మండల నాయకులు గడ్డం వీరన్న విమర్శించారు. మంగళవారం గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై అక్రమ కేసు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఒక మహిళను అడ్డుపెట్టి గిరిజన నాయకుడిపై తప్పుడు కేసులు బనాయించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, ముఖ్యంగా పినపాక నియోజకవర్గంలో రేగా కాంతారావుకు, బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే రాజకీయ ప్రత్యర్థులు తప్పుడు కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయితే ఇలాంటి చర్యలకు పార్టీ నాయకులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తప్పుడు కేసులతో రాజకీయాలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అధికార పక్షాన్ని కోరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందనే భయంతోనే పార్టీ నాయకులను కేసుల్లో ఇరికించి ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపించారు. ఇటువంటి రాజకీయ ధోరణిని వెంటనే విరమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు మొకాళ్ల వీరస్వామి, పార్టీ అధికార ప్రతినిధి టి. రాము, ఎస్సీ సెల్ అధ్యక్షులు నిట్ట రాములు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గొగ్గెల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ బుచ్చి రాములు, పార్టీ నాయకులు రాంబాబు, ప్రమోద్, రమేష్, కిరణ్, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వై పుల్లయ్య డిమాండ్

**తల్లాడ, (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం రేవంత్ రెడ్డి మూడు సంవత్సరాల క్రితం ఇచ్చిన వాగ్దానం ప్రకారం వృద్ధాప్య వితంతు తదితర పెన్షన్లు వెంటనే పెంచాలని అలాగే,వ్యవసాయ కార్మికులకు, ఆటో కార్మికులకు ఇస్తానన్న పెన్షన్లు వెంటనే అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తల్లాడ మండల కేంద్రంలో ఏనుకూర్ తల్లాడ సంయుక్త మండల కమిటీ సమావేశం ఎస్కే జానీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో ఆయన ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్లో, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం, అరెస్టులకు పూనుకోవటం దుర్మార్గమైన చర్యని ఆయన విమర్శించారు. కేసులన్ని ఎత్తివేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేసులను ఉపసంహరించుకోవాలని, అక్రమ అరెస్టులను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఉద్యమకారులపై విచక్షణారహితంగా చేసిన అమానుషకాండపై స్వతంత్ర న్యాయమూర్తుల బృందంతో విచారణ జరిపించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఫీజు రియామెంబర్స్ తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో, కళాశాల కవితవ్యంతో ఆడుకోవడం సరైనది కాదని పాత బకాయిలు ఇస్తూనే ఫీజు రియంబర్స్ మెంట్ ఏ ఏడాది కా ఏడాది ఇచ్చే విధానం పకడ్బందీగా అమలులోకి తీసుకురావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపో వడం విద్యా శాఖపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. యూనివర్సిటీల నుంచి ప్రభుత్వ బడుల దాకా తీవ్ర నిధుల కొరత సమస్యలతో సతమతమవుతున్నాయని, సౌకర్యాలు లేక శిధిల మవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వేల బడులు మూసివేసారని విద్యాశాఖను



ముఖ్యమైన భాగంగా తీసుకుని తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలని,పైరవీలకు తావివ్వరాదని,అలాగే, ఉద్యమకారులను ఏబీసీడీలుగా వర్గీకరరించి, వారికి ప్రభుత్వ పథకాలని వర్తింపజేయాలని,తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో మిగిలిన పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, అలాగే, గోదావరి జలాలను పాలేరు వరకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున, పంటలు ఆలస్యంగా ప్రారంభమైనాయని వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 7500 మరియు 20 కిలోల బియ్యం తదితర జీవన భృతి సౌకర్యాలు కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య, పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి ఎస్కే లాల్ మియా, డివిజన్ నాయకులు ఎలదండి బాబు, పాశం అప్పారావు, డి శ్రీనివాసరావు, ఏనుకూరు తల్లాడ సంయుక్త మండలాల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, మండల నాయకులు గడ్డం లింకులు, ఎస్కే జానీ, గొడ్ల పుల్లమ్మ,డి రమణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం

**అల్వాల్, (సింగిడి):** అల్వాల్ నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా ఏజీఎం పురుషో త్తంరెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఉమా, హై స్కూల్ కోఆర్డినేటర్ కిరణ్, హై స్కూల్ అకాడమిక్ డీన్ శైలజ, రజిత, ఈ ఛాన్స్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ హర్షిత, మల్లికార్జున్ ఏవో, పీఈటీలువం శీకృ ష్ణ, అఖిల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రార్థనతో ప్రారంభమైంది, ప్రిన్సిపల్ ఉమా విద్యార్థి నాయకులకుతో ప్రమాణ స్వీకారం చేయించి వారి బాధ్యతలను వివరించారు. క్యాబినెట్ సభ్యులకు పాఠశాల క్రమశిక్షణ, పరిశుభ్రత, అభివృద్ధి, కోసం కృషి చేస్తామని క్యాబినెట్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

## భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో

**మహాదేవపూర్ (సింగిడి):** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మం దలం రాపల్లి కోటలో నిర్మిస్తున్న గ్రామపం చాయతీ భవన నిర్మాణ పనులను రవీంద్రనాథ్ పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చాలని, నిర్మాణ పనులను సరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామం లో ఉన్న పూరి గుడి సెలను పరిశీలించి పరిస్థి తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కళ్ళ గట్టయ్య, పంచాయ తీ సెక్రటరీ ప్రసాద్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళల సాధికారతకు అవగాహనే మార్గం

సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్



**బిక్కనూరు, (సింగిడి):** బిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా సభలో బాల్య వివాహాల నివారణ, మహిళల హక్కులు, మహిళల అవస రాలు, గ్రామ పరిశుభ్రత, చెత్త నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేఖా సుదర్శన్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు అవగాహనే ప్రధాన మార్గమని అన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలిం చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, మహిళలు తమ హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి కుటుంబం చెత్తను సక్రమంగా నిర్వహిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, ఈఓ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు సురేష్ గౌడ్, పంచాక్షరి, వేణు, రవి, సుజాత, సిద్ధవ్వ, మాధురి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి



**వైరా, (సింగిడి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైరా మున్సిపాలిటీ 5వ వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కట్టా స్వరూప రాణి మాట్లాడుతూ ప్రతి శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. శిశు వు పుట్టిన తొలి గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందిం చడం అత్యంత అవసరమని తెలిపారు. అనంతరం రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఆహారంతో పాటు తల్లిపాలను కొనసా గించాలని సూచించారు. తల్లిపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడటమే కా కుండా, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అంది స్తాయని చెప్పారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, ప్రతి కుటుంబం శిశు ఆరోగ్య పరిరక్షణలో తమ బాధ్యతను గుర్తించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రోత్సహించాలని స్వరూప రాణి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి నిఖిత, ఏఎన్ఎం లలితా కుమారి , అంగన్వాడి ఉపాధ్యాయురాలు శ్రీదేవి, ఆశా వర్కర్ రేణుక, ప్రమీల,మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా వార్షికోత్సవాలు



**మల్హర్, (సింగిడి):** మల్హర్ మండలంలోని మల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవాలు, చిన్నారుల అన్నప్రాశన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాశన నిర్వహించి, వారి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో పాటు ఉజ్వల భవిష్యత్తు కల గాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో. గ్రామ సర్పంచ్ మేకల రాజయ్య, ఉప సర్పంచ్ అవేర్నేని పురుషోత్తం రావు, వార్డు సభ్యు లు బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం, పరిశుభ్రత, పిల్లల ఆరోగ్య సంరక్షణ, సమతుల్య ఆహారం యొక్క ప్రాధా న్యత పై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, వారితో కలిసి వార్షికోత్సవ వేడుకలను ఆనందంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బం ది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పే స్కేల్ అమలు చేయాలంటూ ఉద్యోగుల పెన్‌డౌన్, షట్‌డౌన్

కార్యక్రమంలో మండల ఏపీవో

మల్లికార్జున్ విబిజి రాంజీ సిబ్బంది



**బిజినపల్లి (సింగిడి):** తమకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో బిజినపల్లి వి. బి. జి. రాంజీ (VBG Ramji) ఉద్యోగులు మంగళవారం నిరసన బాట పట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, విధులు బహిష్కరిస్తూ 'పెన్‌డౌన్, షట్‌డౌన్' కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ... తమకు వెంటనే పే స్కేల్ వర్తింపజేయాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ ఇతర సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పే స్కేల్ రాక ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ఉద్యోగులు, ఏపీఓ (APO)మల్లికార్జున్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రామ్మోహన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రవీణ్ కుమార్, రమేష్, ఏసీఓ నాగరాజు, వెంకటేష్‌లతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఎస్ఎఫ్ఐ సమరభేరి

**శిథిల భవనాలు, నాసిరకం భోజనం, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్ డిమాండ్**



**బిజినపల్లి (సింగిడి):** బిజినపల్లి మండలంలోని సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్ ఆరోపించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరి జీపీ యాత్ర బిజినపల్లి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా పాలెం గ్రామంలోని సంక్షేమ హాస్టల్‌తో పాటు బిజినపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, కేజీబీవీ హాస్టల్‌లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారా సింగ్ మాట్లాడుతూ పాలెం సంక్షేమ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిజినపల్లి గురుకుల పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని, నాణ్యతలేని భోజనం అందిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు సరిపడా ఆహారం అందించడం లేదని పేర్కొంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేజీబీవీ హాస్టల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టళ్లలో మెనూ అమలు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, నాయకులు హేమంత్, శివకుమార్, భాను ప్రకాష్, నందిని తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసించండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయ రాములు**



**అమరచింత, (సింగిడి):** కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పరిపాలనను నిర్మూలించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు పిలుపునిచ్చారు. మంగళవారం అమరచింతలోని సిపిఐ కార్యాలయంలో బద్లావ్ జరూరి హై మార్పు కావాలి అనే అంశంపై నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విజయరాములు హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక పరిపాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు కావలసింది తక్కువ వడ్డీకి రుణాలు నీటిపారుదల వసతులు కల్పించినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. గత దశబ్ద కాలంపైగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అపూర్వమైన ప్రగతిని సాధించినట్లు ఒక చిత్రాన్ని ప్రాజెక్ట్ చేస్తుందని ఆరోపించారు. కోట్లాదిమంది ప్రజల జీవితాన్నిభవాలు మాత్రం ఇందుకు భిన్నమైన కథనాలు చెబుతున్నాయని నరేంద్ర మోడీ పరిపాలనలో దళిత బలహీన ఆదివాసి వర్గాలు పూర్తిగా కృషించి పోయాయని ఆరోపించారు. దళిత ఆదివాసీలపై ప్రకృతి దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాజకీయ ప్రచారం పాదయాత్రకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. పాదయాత్రలు 2026, సెప్టెంబర్ 1న న్యూఢిల్లీ లోని రామ్ లీలా మైదానంలో జరగబో యేబద్లావ్ జరూరిహై ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ ఈ శ్రీహరి కోకన్వీనర్ టి నరసింహ, లక్ష్మీ శెట్టి శ్యాంసుందర్ అబ్రహం భాస్కర్ మోష నాగరాజు లక్ష్మీనారాయణ అంజి తో పాటు సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్లాట్లు అమ్మి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం

**మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు పై బాధితుల ఆరోపణ**

**న్యాయం చేయాలంటూ తహసిల్దారును ఆశ్రయించిన బాధితులు**



**అమరచింత, (సింగిడి):** పిన్నంచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు పిన్నంచర్ల గ్రామ శివారులోని సర్వేనెంబర్ 128లో 4:04 గుంటల భూమిని 81 ప్లాట్లుగా చేసి ప్రజలకు 1997 సంవత్సరంలో విక్రయించారని బాధితులు ఆరోపించారు. మోసంపై ఆత్మకూర్ తహసిల్దార్ జె కె మోహన్ ను ఆశ్రయించారు. ఈరోజు, రేపు, ఎల్లుండి అని చెప్పుకుంటూ 30 సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్ చేయకుండా ప్లాట్లు కొన్న వ్యక్తులను మోసం చేసుకుంటూ వస్తున్నాడు. ఆ భూమి వ్యవసాయ భూమిగా పెట్టుకొని, రైతుబంధు, రైతు భరోసా డబ్బులు తీసుకుంటూ, వ్యవసాయ భూమిని, నాలా గా మార్చకుండా ప్రభుత్వ సొమ్మును ( రైతుబంధు, రైతు భరోసా డబ్బులను) యదేచ్చగా దోచుకుంటున్నాడనీ బాధితులు ఆరోపించారు. అదే భూమిని 1996 సంవత్సరం లో పిన్నంచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామస్వామి గౌడ్ కి ప్లాట్లు చేయకముందే అమ్మడం జరిగింది. అక్కడ రామస్వామి దగ్గర డబ్బులు తీసుకుని ప్లాట్ల కొన్న వ్యక్తుల దగ్గర డబ్బులు తీసుకుని, అంటే ఇక్కడ ఇద్దరు (ప్లాట్లు కొన్న వ్యక్తులు, రామస్వామి గౌడ్) దగ్గర డబ్బులు తీసుకొని రెండు విధాలుగా లబ్ధి పొంది పై వ్యక్తులను మోసం చేశాడని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నోసార్లు ఊర్లో పంచాయతీ పెట్టిన ఫలితం దక్కలేదు. గత నెల రోజుల కింద పెద్ద ఎత్తున ఊర్లో పంచాయతీ పెడితే, ఎమ్మార్వో దగ్గరికి పోదాము రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి, ఎమ్మార్వో దగ్గరికి వచ్చేసరికి నాకు ఒక నెల సమయం ఇవ్వండి అని చెప్పి జూన్ నెల 12 తారీకు, నుండి అంటే జూలై 12 తారీకు వరకు, ఆరు నూరైనా ఆరోజు మీకు రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి, తహసిల్దార్ సాక్షిగా, మాజీ వైస్ ఎంపీపీ కోటేశ్వర్ సాక్షిగా ఒప్పుకొని, నెలరోజులు దాటిన ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయకుండా ప్లాట్లు కొన్న వ్యక్తులను మోసం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు బాధితులు వినతి పత్రాన్ని అందజేశారు.

## కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జన్ను విజయ్ కుమార్



**మహాదేవపూర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లామహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను దోస్త్ ప్రత్యేక రెండో విడత డిగ్రీ లో ప్రవేశాల కోసం ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జన్ను విజయ్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కొరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా 400 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, గత విడతలో ప్రవేశం పొందిన విద్యార్థులకు తమ కోర్సు లేదా మార్చుకునేందుకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రభుత్వ సౌకర్యాలతో అందుబాటులో ఉన్న మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చేరి తమ ఉన్నత విద్యను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

# రోడ్డుపైనే ప్రయాణికుల నిరీక్షణ..

**మరుగుదొడ్లు, తాగునీరు, షెల్టర్, లైటింగ్ వంటి కనీస సౌకర్యాలు కూడా కరువు**

**వెంటనే బస్టాండ్ నిర్మించాలని ప్రజల డిమాండ్**






**గుండాల, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల కేంద్రంలో శాశ్వత ఆర్టీసీ బస్టాండ్ లేకపోవడంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని పలు మండల కేంద్రాల్లో ఆధునిక బస్టాండ్లు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, గుండాల మండల కేంద్రంలో మాత్రం నేటికీ బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలకు గుండాల ప్రధాన రవాణా కేంద్రంగా ఉన్నప్పటికీ, కనీస ప్రయాణికుల వసతులు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.

**ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికుల రాకపోకలు**

గుండాల మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ఉద్యోగాలు, విద్య, వైద్య సేవలు, ప్రభుత్వ కార్యాలయాల పనులు, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ గుండాలకు చేరుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఇల్లందు, మణుగూరు, హన్మకొండ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల రద్దీ అధికంగానే ఉన్నప్పటికీ, వారికి వేచి ఉండేందుకు సరైన బస్టాండ్ లేక రహదారి పక్కనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఎండలో మండుతున్న..వర్షంలో తడుస్తున్న ప్రయాణికులు**

వేసవిలో మండే ఎండ, వర్షాకాలంలో కుండపోత వర్షం, చలికాలంలో చలి.. ఏ కాలమైనా ప్రయాణికులకు ఆశ్రయం కల్పించే షెల్టర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులతో వచ్చిన మహిళలు, వృద్ధులు, అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లే రోగులు గంటల తరబడి రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. వర్షం కురిసే సమయంలో చెట్ల కింద లేదా సమీప దుకాణాల వద్ద తలదాచుకోవడం తప్ప మరో మార్గం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

**మహిళలకు మరింత ఇబ్బందికర పరిస్థితి**

మండల కేంద్రంలో ప్రజలకు ఉపయోగపడే మరుగుదొడ్లు లేకపోవడం మహిళలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. చిన్నారులతో ప్రయాణించే కుటుంబాలు, వృద్ధులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం ప్రయాణికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రకటిస్తున్నప్పటికీ, గుండాలలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

**రాత్రి వేళల్లో భద్రతపై ఆందోళన**

బస్టాండ్ లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణికులు రహదారి పక్కనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. సరైన వీధి దీపాలు, లైటింగ్ లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారు. వేగంగా వెళ్లే వాహనాల మధ్య రహదారి పక్కనే నిలబడటం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఏళ్లుగా హామీలే.. ఆచరణ మాత్రం శూన్యం**

గుండాల మండలానికి బస్టాండ్ నిర్మించాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని ప్రజలు చెబుతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో బస్టాండ్ నిర్మాణ హామీలు వినిపించినప్పటికీ, ఎన్నికలు ముగిసిన తర్వాత సమస్య మళ్లీ మరుగున పడిపోతోందని విమర్శిస్తున్నారు.

**అభివృద్ధి చెందుతున్న మండలానికి బస్టాండ్ అత్యవసరం**

గుండాల మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో రవాణా సదుపాయాల విస్తరణ కూడా అత్యవసరంగా మారింది. మండల కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నందున ఆధునిక బస్టాండ్ నిర్మాణం అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వేచి ఉండేందుకు విశాలమైన షెల్టర్, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి వసతి, విద్యుత్ దీపాలు, కూర్చునే బెంచీలు, పార్కింగ్ సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

**ప్రజల డిమాండ్ ఇదే**

గుండాల మండల కేంద్రంలో శాశ్వత ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి వెంటనే స్థలాన్ని ఖరారు చేసి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బస్టాండ్ నిర్మాణంతో వేలాది మంది ప్రయాణికులకు ఉపశమనం లభించడంతో పాటు మండల కేంద్రానికి మరింత అభివృద్ధి చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## స్కూల్ బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

**120 మంది డ్రైవర్లకు శిక్షణ.. భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన**






**మెట్‌పల్లి, (సింగిడి):** విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ జగిత్యాల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో మంగళవారం స్కూల్ బస్సు డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యాలకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి సందాని మహమ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మెట్‌పల్లి డీఎస్పీ రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో డ్రైవర్లు ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. రవాణా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని అన్నారు. జిల్లా రవాణా అధికారి సందాని మహమ్మద్ మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్సులో అటెండెంట్ తప్పనిసరిగా ఉండాలని, బస్సు నడిపే డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ప్రతిరోజూ ప్రయాణానికి ముందు టైర్లు, బ్రేకులు, స్టీరింగ్‌తో పాటు ఇతర యాంత్రిక వ్యవస్థలను పరిశీలించిన తర్వాతే బస్సులను రోడ్డుపైకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఏఎంవీఐలు జి. శ్రీనివాసరావు, ఎం. సాయిచరణ్, షేక్ రియాజ్‌లు డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గతంలో జరిగిన స్కూల్ బస్సు ప్రమాదాలను ఉదాహరణగా వివరిస్తూ, ప్రమాదాలకు దారితీసే కారణాలు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలను వివరించారు. ఈ అవగాహన సదస్సులో మెట్‌పల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 120 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు, వివిధ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తూ రవాణా శాఖ సూచించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు.

## ప్రతీ ఇంటా ఇంకుడుగుంత ఉండాల్సిందే..

**ప్రతీ నీటి చుక్కను ఒడిసిపట్టేందుకు చర్యలు..**



**పాలేరు (సింగిడి):** ప్రతీ ఇంటా ఇంకుడు గుంత ఉండాల్సిందేనని నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య సూచించారు. నేలకొండపల్లి మండలం లోని బుద్ధారం, ఆజయ్ తండా, తిరుమలాపురం పంచాయతీ లలో మంగళవారం పర్యటించారు. ఇంకుడు గుంతల పై అవగాహన కల్పించారు. నూతనంగా నిర్మించనున్న గ్రామ సమాఖ్య భవనాల పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేలకొండపల్లి మండలంలో ప్రతీ నీటి చుక్క ను ఒడిసిపట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న కాలం నీటి సమస్య తీవ్రంగా ఉండనున్నట్లు తెలిపారు. ఆ సమస్య ను ఎదుర్కొనేందుకు జలసిరి కార్యక్రమం ను చేపట్టినట్లు తెలిపారు. మండలం లో 2.368 మంది ఐదు ఎకరాల లోపు రైతులు గుర్తించినట్లు తెలిపారు. వీరిలో అర్హత కలిగిన వారికి పంట కుంటలను మంజూరు చేస్తామని చెప్పారు. అదే విధంగా మండల వ్యాప్తంగా 1630 మంది వ్యక్తిగత ఇంకుడు గుంతలు అవసరమని గుర్తించామని పేర్కొన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలను 109 చోట్ల, డ్రైనేజీ ముగింపు దగ్గర ఇంకుడు గుంతలకు 44 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. క్షేత్ర స్థా యిలో సర్వే పూర్తి చేసిన తరువాత రైతుల నుంచి అంగీకార పత్రాలను తీసు కోవాలని సూచించారు. రానున్న వేసవి ని దృష్టిలో ఉంచుకుని జలసిరి పథకం లో నీటిని ఒడిసిపట్టేందుకు అవసరమైన చర్యలు తీసు కుంటున్నట్లు తెలి పారు. అదే విధంగా గ్రామ సమాఖ్య భవనాలను శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యం. శ్రీనివాసరావు, పంచాయతీ సర్పంచ్ లు మేళ్లచెరువు సత్యం, తేజావత్ శివాజీ, క మదన ప్రవీణ్, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, సొసైటీ మాజీ చైర్మన్ ఆరెకట్ల గురవయ్య, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు యం. వెంకటేశ్వర్లు, బైరం దినేష్కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## కాకతీయ శివాలయానికి గుర్తింపు తేవాలి

**రిటైర్డ్ ఐఏఎస్ ఛత్రత్ సూచన..**

**కలెక్టర్, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ**

**నల్లబెల్లి, (సింగిడి):** నల్లబెల్లి మండలం శనిగరం గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధిలోని కాకతీయుల కాలం నాటి ప్రాచీన శివాలయాన్ని హర్యానా క్యాడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఛత్రత్ మంగళవారంసందర్శించారు. ఆలయ చారిత్రక విశిష్టత, పురాతన నిర్మాణ శైలి, సాంస్కృతిక ప్రాధాన్యతపై గ్రామ సర్పంచ్ ఉట్కూరి అశోక్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, పరిరక్షణ కోసం గతంలో గ్రామపంచాయతీ తరఫున వరంగల్ పురావస్తు శాఖ అధికారులకు, నల్లబెల్లి మండల తహ సీల్దార్‌కు లేఖలు పంపిన విషయాన్ని సర్పంచ్ తెలిపారు. ఆలయానికి సంబంధించిన మాన్యం భూములను గుర్తించి సంరక్షించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. వివరాలు విన్న రిటైర్డ్ ఐఏఎస్ ఛత్రత్ స్పందిస్తూ, కాకతీయుల చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ శివాలయానికి తగిన గుర్తింపు కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. ఆలయంతో పాటు దాని మాన్యం భూములను వెలుగులోకి తీసుకువచ్చి పరిరక్షించేలా జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇటువంటి చారిత్రక కట్టడాలను సంరక్షించడం ద్వారా భావితరాలకువారసత్వాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉట్కూరి అశోక్, పంచాయతీ కార్యదర్శి బి. మధు, జీపీఓ పైడయ్య, గొల్లపల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## డీప్ సైడ్ 2 బొగ్గు బ్లాక్ సింగరేణికే

**ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం**

**సంబురాల్లో బీజేపీ నాయకులు**



**లక్ష్మీదేవిపల్లి, (సింగిడి):** మణుగూరు ఓసీ–×× డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మణుగూరు ఏరియాలోని బొగ్గు బ్లాక్ వేలంపాటలో సింగరేణి సంస్థ, జెన్‌కో మధ్య పోటీ నెలకొన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆ బొగ్గు బ్లాక్ సింగరేణికే దక్కడం రాష్ట్రంలోని బొగ్గు కార్మికులకు, ఈ ప్రాంత ప్రజలకు శుభపరిణామమని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల ఉపాధి భద్రత, తెలంగాణ పారిశ్రామిక ప్రగతిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

**కాటారం, (సింగిడి):** జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ మధుసూదన్ మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమికఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోనిఓపీ రిజిస్టర్, హాజరు రిజిస్టర్లను పరిశీలించి, వైద్య సేవల నిర్వహణపై ఆరాతీశారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీ, ఇన్‌పేషెంట్ (ఐపీ) వార్డు, ఎక్స్‌రేగదిని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా కాలానుగుణ వ్యాధులను సమర్థవంతంగాఎదుర్కొనేందుకు అవసరమైన టెస్ట్ కిట్లు, మందులు ఎల్లప్పుడూ తగినంత నిల్వలోఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణీలు, చిన్నారులు, సాధారణ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగిని బాధ్యతతో పరీక్షించి చికిత్స అందించాలనిఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్డు

**మహదేవపూర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలమండలంలోఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కామన్ పల్లి ముకునూర్ గ్రామాల మధ్య రోడ్డు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దింతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గ్రామాల మధ్య తెగిపోయిన రోడ్డునుసంబంధిత అధికారులు మరమ్మత్తులు చేసి ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పరుచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభాతవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
6-8-2026

## కురవి వీరభద్రుడి హుండీ రూ.53,97,671 లక్షల ఆదాయం



**డోర్నకల్ /కురవి (సింగిడి):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కురవి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో భక్తులుతమ భక్తిని మరోసారి చాటుకున్నారు. ఆలయ అధికారుల పర్యవే క్షణలో మంగళవారంహుండీల లెక్కింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో నారాయణ మీడియాతోమాట్లాడారు.. కురవి ఆలయ హుండీలను తెరిచి నోట్లు,నాణేలను వేరు చేసి అనంతరంగంటల తరబడి లెక్కింపు చేపట్టారు. లెక్కింపు అనంతరం అధికారులు వెల్లడించినవివరాల ప్రకారం,శ్రీ భద్రకాళి అమ్మవారి హుండీ ద్వారా రూ. 13,43,970 ఆదాయంవచ్చింది. అదేవిధంగా శ్రీ వీరభద్ర స్వామివారి ప్రధాన హుండీకి రూ. 40,53,701కానుకలు సమర్పించారు. ఈ రెండు హుండీల ద్వారా మొత్తంగా రూ. 53,97,671 ఆదాయంఆలయానికి సమకూరిం దన్నారు. అలాగే భక్తులు సమర్పించిన వెండి, బంగారంకానుకలను తిరిగి ఉండిలో వేయడం జరిగింద న్నారు. కొన్ని దేశాల కరెన్సీ కూడాకురివి వీరభద్రునికి సమర్పించుకున్నారని వాటిని పైసలుగా మార్చుకోవడంజరిగిందన్నారు. ఇటీవల ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులుచెల్లించుకోవడం,ప్రత్యేక పూజలు చేయించుకోవడంతో ఈ స్థాయిలో ఆదాయంవచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈవో పేర్కొన్నారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయఅభివృద్ధి పనులకు,భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానిక ఉపయోగిస్తామని అన్నా రు. లెక్కింపు చేసిన సొమ్మును బ్యాంక్ లో వేయడంజరిగిం దన్నారు. కురవి వీరభద్ర స్వామి ఆలయం తెలంగాణలోనే ప్రసిద్ధి చెందినశైవ క్షేత్రం. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చిస్వామివారిని దర్శించుకుంటారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్రవీందర్ రెడ్డి, కమిటీ మెంబర్లు, పరిశీలికులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో న్యాయ అవగాహనకు మొబైల్ వ్యాన్

### ఉచిత న్యాయ సహాయంపై ప్రజలకు అవగాహన




**మహాముత్తారం/కాటారం, (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ లీగల్ అవేర్‌నెస్ వ్యాన్ ద్వారా కాటారం కేంద్రంతో పాటు కాటారం గ్రామపంచాయతీ, ఇబ్రహీంపల్లి, చింతకాని, గొర్లకుంట, మాదారం, మహాముత్తారం గ్రామాల్లో మంగళవారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయ సహాయం పొందలేని వారు, కోర్టు కేసుల్లో చిక్కుకున్న బాధితులు, కుటుంబ, సివిల్, ప్రామిసరీ నోట్ తదితర వివాదాల్లో ఉన్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. అక్షయ, ప్యానెల్ లాయర్ పారానంది సురేందర్, సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని, పరస్పర అవగాహనతో వివాదాలకు ముగింపు పలికి సోదరభావంతో జీవించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటారం ఆర్డీఓ రవీందర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జీ. నవీన్ రెడ్డి, కాటారం సర్పంచ్ పంతకాని సడవలి, ఇబ్రహీంపల్లి సర్పంచ్ సరోజన, చింతకాని సర్పంచ్ పద్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, కే. వెంకటేష్, ఎం. రాజ్‌కుమార్, పారా లీగల్ వాలంటీర్లు లింగమల్ల రమాదేవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 10న జైల్ భరో ను జయప్రదం చేయండి




**అమరచింత, (సింగిడి):** ఆగస్టు పదిన జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం వనపర్తి జిల్లాఅధ్యక్షులు యస్ అజయ్. ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రం లోమంగళవారం సి ఐ టి యు కార్యాలయం లో జరిగిన జిల్లా కమిటీ సమావేశం అనంతరం విలేకరుల సమావేశం లో మాట్లాడుతు. 1942ఆగష్టు 9ఆనాటి బ్రిటిష్ వారికీ వ్యతిరేకం గా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి తో ఆగష్టు 10న వ్యవ సాయ. కార్మిక. రైతు సంఘాల సంయుక్తశీ గా జైల్ భరో కార్యక్రమం ను దేశవ్యాప్తంగా 550జిల్లాలో చేయనున్నట్లు వివరించారు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పతకం పేరు మర్చి కేంద్రం భరించే 90%నిధులను 60%కి తగ్గించి రాష్ట్ర లు భరించే 10%ను 40%కి పెంచడం సరికాదని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు వ్యవసాయ పెట్టుబడికి అయ్యే ఖర్చుకు అదనంగా 50% కలిపి వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు గతంలో ఢిల్లీలో చేపట్టిన ఆందోళన నేపథ్యంలో రైతులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన కనీస మద్దతు ధర. రైతు ఉద్యమంలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం. అక్రమంగా పెట్టిన కేసులను డిమాండ్ చేశారు. 26 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్ లు గా తేవడం సరికాదని తీయబడ్డారు. కార్మికుల కనీస వేతనం పిఎఫ్. గ్రాట్యూటీ ఇన్సూరెన్స్ లాంటి కనీస ప్రమాణాలను అమలు చేయాలని సూచించారు. నీట్ పేపర్ లీకుపై ఆందోళన లు చేపట్టిన విద్యార్థియువకులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపరు లీకల వల్ల దేశంలో 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని బట్టి విద్యార్థి ప్రతి ఒక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 10న జరిగే కార్యక్రమానికి రైతులు వ్యవసాయకూలీలురైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ దేవన్న,ఎం వెంకటయ్య, సహాయ కార్యదర్శి ,మండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెన్నా సిమెంట్ (అదానీ గ్రూప్)కు వ్యతిరేకంగా హైకోర్టులో ప్రజా న్యాయ పోరాటం



**పాలకవీడు (సింగిడి):** పాలకవీడు మం డలం శూన్యపహాడ్ గ్రామం నుండి గణేష్ పహాడ్ గ్రామానికి వెళుతున్న 3కిలోమీటరుల ప్రజా బిటి రోడ్డును రక్షించాలని మంగళవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు నక్కశ్రీనివాస్, సైదా నాయక్, అశోక్ నాయక్, నరి నాయక్, రామావత్ భాస్కర్ నాయక్ లు తెలిపారు. పిటిషనర్స్ తరపున హైకోర్టు న్యాయవాది నక్కనవీన్ వాదనలు వినిపిస్తారని అన్నారు. పెన్నా సిమెంట్స్ (అదానీ గ్రూప్స్) మైనింగ్ కోసం ప్రజా రహదారిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ధనంతో నిర్మించిన రహదారిని కాపాడాలని,మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో పాటు ప్రజా మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించాలి అని, రహదారినిమూసివేయకుండా యథాతథ స్థితిగా కొనసా గించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్14,19(1)(ఎ),21ఉల్లంఘన జరిగిందని పిటిషన్ దాఖలు చేశామనికేసు గురువారం విచారణ జరిగే అవకాశం ఉందని వారు తెలిపారు.

# విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

## టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు



**పాలేరు (సింగిడి):** ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని,వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం,విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి 15% నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యుకెజి కే పరిమితం చేశారని, ప్రీప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12.00 గంటల వరకే నడపాలన్నారు కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4.00 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12.00 తర్వాత పసి పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఓ 25 ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఈఓ,రెవెన్యూ డివిజన్ కు ఒక డిప్యూటీ ఇఓ,అన్ని మండలాలకు ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని, పిఓ 2018 కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారు ల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకో వడంలేదని యుయస్పిసి నాయకులు విమర్శించారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టా లని, టెట్ లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డియస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖ లో బిసి, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్ ను, ఎయిడెడ్ స్కూల్స్ ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయా లని, జిఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, జిఓ 190 అమలు చేయాలని, 5 వాయిదాల కరువు భత్యం (డిఎ) ను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను ప్రతినెల రూ 2000 కోట్ల చొప్పున విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యోగస్తులకు ఆరోగ్య భద్రత కల్పించే విధంగా ఉండాలని ఆయన కోరారు. ఆమేరకు ఆగస్టు 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు, ఆనాటి నుండి పిఆర్సీ ప్రకటించేదాకా ప్రతిరోజూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యుయస్పిసి పిలుపునిచ్చింది. ఆగస్టు 12,13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండంలు, ఆగస్టు 19 నాడు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఆగస్టు 29న హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్ లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమం ఉంటుం దని,అన్ని సంఘాలు ఐక్య పోరాటాలకు కలిసి రావాలని, ఉపాధ్యా యులు అందరూ సంఘాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండల సభ్యత్వ క్యాంపైన్ లో భాగంగా నేలకొండపల్లి మండలం నందు,మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి రామారావు పి గోవిందరావు మండల సబ్ కమిటీ సభ్యులు జై జై ప్రధానోపాధ్యాయులు టి కమలాకర్ రవి,గణేష్, భాగ్యలక్ష్మి, చీనా వెంకన్న, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట వైద్య కళాశాలకు పెద్ది పేరు పెట్టాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్.. పెద్ది కుటుంబాన్నిపరామర్శించిన రాష్ట్ర నాయకులు.



**నల్లబెల్లి, (సింగిడి):** తెలంగాణ ఉద్యమంలో విశిష్ట సేవలందించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును నర్సంపేట వైద్య కళాశాలకు నామకరణం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఐదో రోజు కర్మ సందర్భంగా నల్లబెల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎనిమిది జిల్లాల నుంచి వచ్చిన 400 మందికి పైగా ఉద్యమకారులతో కలిసి ఆయన పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాసరా వుమా ట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలు పెరగని పోరాటం చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమ ఆణిముత్యంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం నర్సంపేట ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివనికొనియాడారు. రామప్ప లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దేవాదుల జలాలను రంగయ్య చెరువు, మాదన్నపేట చెరువు, పాకాల సరస్సుకు మళ్లించి వేలాది ఎకరాలకు సాగునీరు అందించారని, నర్సంపేటకు మెడికల్ కళాశాల మంజూరులో కీలక పాత్ర పోషించారని చెప్పారు. నల్లబెల్లి మండలానికి వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటు, మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా, రహదారులు, చెక్‌డ్యాంల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను పెద్ది సుదర్శన్ రెడ్డి ముందుండి సాధించారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన నాయకుడిని కోల్పోవడం రాష్ట్రానికే తీరని లోటని అన్నారు. అనంతరం డాక్టర్ చీమ శ్రీనివాసరావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు పెద్ది సతీమణి స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. పెద్ది ఆశయాలను కొనసాగించాలని, ఆయన సేవలను భావితరాలకు చాటిచెప్పాలనిఉద్యమకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, మహిళా ప్రతినిధులు,ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆసుపత్రి నైట్ వాచ్‌మెన్

## ముజీబ్ మృతికి నివాళి



**పెబ్బేరు, (సింగిడి):** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నైట్ వాచ్‌మెన్ ముజీబ్ ఆకస్మిక మృతితో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ ఆసుపత్రిలో నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ సేవలందించిన ముజీబ్ సోమవారం రాత్రి విధుల్లో ఉండగా గుండెపోటుకు గురై, మంగళవారం ఉదయం ఆసుపత్రిలోనే కన్నుమూశారు. ముజీబ్ మృతి విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, గతంలో ఇదే ఆసుపత్రిలో పనిచేసిన వైద్యులు ఆయన స్వగృహానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. మానవతా దృక్పథంతో స్పందించిన ప్రస్తుత, మాజీ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ. 36 వేల నగదు ఆర్థిక సాయాన్ని ముజీబ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, ముజీబ్ ఆసుపత్రికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన కుటుంబం అత్యంత నిరుపేదది. కుటుంబాన్ని పోషించే వ్యక్తిని కోల్పోవడం వారికి తీరని లోటు. ప్రభుత్వం కూడా స్పందించి బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా నిలవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొని ముజీబ్‌కు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



**మహాదేవపూర్ (సింగిడి):** అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి అన్నారు. మహాదేవపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సూరారం అంగన్వాడి కేంద్రంలో ప్రాజెక్టు అధికారిని అయిత రాధికా రెడ్డి ఆదేశాల మేరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ పిల్లలు పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యం త ముఖ్యమని తెలిపారు . శిశువు పుట్టిన వెంటనే తల్లికి వచ్చే పసుపు రంగు పాలు శిశువుకు తొలి టీకాలాగా పనిచేసి రోగ నిరో ధక శక్తిని పెంచు తాయని పేర్కొన్నారు. మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే శిశువుకు అందించాలని నీరు తేనే లేదా ఆహారం ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలలు దాటిన తర్వాత ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారాన్ని అందిస్తూ తల్లిపాలు రెండు సంవ త్సరాల వరకు పట్టించాలని సూచించారు. అనంతరం అంగ న్వాడీలో అన్నప్రా సన అక్షరాభ్యాసం నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ మేకల శంకరమ్మ ఉప సర్పంచ్ చల్ల చిన్నన్న హై స్కూల్ ఇన్చార్జి హె చ్ఎం రవీందర్ పాఠశాల ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్ చం ద్రిక శాంత అంజలి గర్భిణీలు బాలింతలు పిల్లతల్లులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థిని సన్మానించిన

## పాఠశాల యజమాన్యం

**మహాదేవపూర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాలలో విద్యనభ్యసించి నీట్ లో 649ర్యాంక్ సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి దాసరి అశ్వితను పాఠశాలయజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యుడుచల్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అశ్విత తమపాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసిం చిందని,నీటిలో ర్యాంక్ సాధించడంఅభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయనఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్ ,విద్యార్థిని తండ్రి దాసరి తోపాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదల, ఎంబీఎస్పీపై కేంద్రం వైఫల్యం

### నేలకొండపల్లిలో సిపిఐ నిరసన పోస్టర్ ఆవిష్కరణ



**పాలేరు (సింగిడి):** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సమరశంఖం పూరించింది. "బదలావ్ జరూరీ హై – మార్పు కావాలి" అనే నినాదంతో చేపడుతున్న విస్తృత నిరసన ప్రచార కార్యక్రమ పాదయాత్రల పోస్టరను మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ( ఎం. ఎస్. పి )కు చట్టబద్ధత కల్పించడంలో మరియు కార్మికుల సత్వర హక్కులను పరిరక్షించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ నిరంకుశ, ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా ఆగస్టు 6 నుండి 14 వరకు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా చైతన్య పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రల ద్వారా కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను ప్రజల్లో ఎండగడతామని, అనంతరం సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడేందుకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలు మరియు 'చలో ఢిల్లీ' పిలుపులో నేలకొండపల్లి మండల ప్రజలు, రైతులు, కార్మికులు, యువత విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ కౌన్సిల్ సభ్యులు కాశబోయన అయోధ్య,అనంతు పుల్లయ్య, వాసంశెట్టి వేంకటేశ్వర్లు, నాగయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పోలీసింగ్ మరింత పటిష్టం చేయండి... ఎస్పీ

### మెట్‌పల్లిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ.. రాత్రి గస్తీ, వాహన తనిఖీలు పెంచాలని సూచన




**మెట్‌పల్లి, (సింగిడి):** నేరాల నియం త్రణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల కు భరోసా కల్పించేలా పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ (ఐపీఎస్) సూచించారు. మంగళవారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్ పనితీరు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పర్యవేక్షణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను సమీక్షించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని, స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామాల వారీగా సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. నేరాలను ముందుగానే అరికట్టేందుకు రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, అనుమానితులపై నిఘా, బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతంగా ఉపయోగించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగించాలని, యువతలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, మైనర్ల వాహనాల వినియోగం, ప్రమాదకర డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై కఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. తనిఖీలో డీఎస్పీ రాములు, ఎస్ఐ కిరణ్ కుమార్, రాజు నాయక్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారి శ్రేష్టకు ఆశీస్సులు అందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్



**వైరా, (సింగిడి):** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా పాత కూరగాయల మార్కెట్ రోడ్‌లో బాలు, ప్రశాంతి దంపతుల కుమార్తె శ్రేష్ట తొలి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ హాజరై చిన్నారి శ్రేష్టను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి రవి, రాయపూడి వెంకటేష్, రంగా సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi గురువారం 6-8-2026

## సమస్యల నివారణకే భూ హద్దుల రీసర్వే – ఆర్డీవో రమణారెడ్డి



**వేములపల్లి, (సింగిడి):** భూ రీసర్వే పనులకు రైతులు తమ పూర్తిస్థాయి సహకారాన్ని అందించాలని ఆర్డీవో రమణారెడ్డి పిలుపునిచ్చారు. భూమికి సంబంధించిన వివాదాలను శాశ్వతంగా నివారించేందుకు వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే తీరుతెన్నులను మంగళవారం ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి సర్వే నంబర్ వారీగా పక్కాగా చేపడుతున్న ఈ ప్రక్రియతో భూముల సరిహద్దులు, పొజిషన్ ఖచ్చితంగా తేలి యజమానుల వివాదాలకు శాశ్వత ముగింపు లభిస్తుందని తెలియజేశారు. సర్వే చేపట్టే ప్రాంతాలు, సర్వే నంబర్ల వివరాలను ఒక రోజు ముందుగానే సంబంధిత రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. అధికారులు ఇచ్చే పూర్వ సమాచారం మేరకు రైతు సోదరులు తమ పొలాల వద్ద సిద్ధంగా ఉంటే సకాలంలో సరిహద్దుల నిర్ధారణ పూర్తయి సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని కోరారు. కావున ప్రతి ఒక్కరూ సర్వే సిబ్బందికి సహకరించి తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, సర్పంచ్ దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జీపీవో తేజ, సర్వేయర్లు ఇందిరా, లింగారెడ్డి, జానకిరాములు, ఇమ్రాన్, రైతులు పాల్గొన్నారు.

## రైతులు తక్కువ నీటి వినియోగచర్యలు చేపట్టాలి





**కమలాపూర్, (సింగిడి):** రైతులు వర్ష అనుకూల ప్రత్యామ్నాయ పంటలు వేసితక్కువ నీటి వినియోగ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర అన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర వంగపల్లిరైతువేదికను సందర్శించి స్థానిక రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత పర్యావరణ పరిస్థితుల ప్రభావం, సాగుకు సంబంధించిన ప్రస్తుత సమస్యలు గురించివివరించారు. తక్షణం రైతులు అనుస రించవలసిన ప్రత్యామ్నాయ చర్యలనుసూచిం చారు. వ ర్షపరంగా అనుకూలమైన, ప్రాంతానుకూల విత్తనాలను వినియోగించాలనితెలిపారు. డ్రిప్, మైక్రో ఇరిగేషన్ వంటి నీటి ఆదా పద్ధతుల అమలుపరిచి,నీటి వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణఅ నుగుణ ంగా ఎరువుల వినియోగం,మల్చింగ్, సముచిత సోయిల్ టెస్టింగ్ ద్వారాపర్యా వరణానుకూల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎ రువుల అమ్మకం దారులు ఎరువుల ధరలకు అమ్మకుండా ప్రభుత్వ మార్గదర్శ కాలనుఖచ్చితంగా పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం అనితెలిపారు. తప్పుడు , తక్కువ ప్రమాణపు ఉత్పత్తుల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదా రులకు సరైన ప్యాకింగ్ బిల్లులు ఇవ్వాలనిఎరువుల వ్యాపారును ఆదేశించా రు. ఎరువుల సరఫరా లో సమస్యలు కనిపిస్తే వెంటనే పరిష్కారం చేయాలని స్థానికవ్యవ సాయ అధికారులను ఆదేశించారు. అదే విదంగా వరంగల్ వ్యవసాయ కళాశాలవిద్యా ర్థులతో సమావేశమై తాజా పర్యావరణ పరిస్థితులు, ఫీచర్ చేయవలసినపరిశోధన అంశా లు, విద్యార్థుల ద్వారా రైతులకు అందిం చగల సాంకేతిక సహాయంపైచర్చిం చా రు. విద్యార్థులు తమ ప్రాజెక్టులు, శాతం పరిశీ లనలు ,ప్రాక్టికల్ సూచనలను చేశారు. విద్యార్థుల ప్రాక్టికల్ ఫీల్డ్ రీసెర్చ్‌కు ప్రోత్సా హంకల్పించి రైతులతో కలిసి ప్రాంతీయ పరిష్కారాలపై పనిచేయాలన్నారు. ఈసమా వేశంలో మండల వ్యవసాయ అధికారి వేణు,గ్రామ సర్పంచ్ నకీర్త రాజు, వలిగేసాం బారావు,వ్యవసాయ విస్తరణ అధికారులు జయప్రకాష్, ప్రశాంత్ ,తిరుపతి, రహీంప్ర తాప్ , పంగిడిపల్లి, వంగపల్లి, రైతులు పాల్గొన్నారు.

## బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది!

### మరిపెడలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

### మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎ సి డి పి ఓ తేజ కళ్యాణి, కౌన్సిలర్ సురేష్.



**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది లాంటివని మరిపెడ ఐసిడిఎస్ప్రాజెక్టు ఏసీడీపీఓ తేజ కళ్యాణి,పట్టణ 14 వ కౌన్సిలర్ జాటోతు సురేష్‌అన్నారు. మంగళవారంమరి పెడ మున్సిపాలిటీ కేంద్రంలో సేవా నగర్, బ్యాంక్‌కాలనీ,రాము తండా,గ్యామాతండ,హౌసింగ్ బోర్డు,మైనార్టీ కాలనీ, అంగన్వాడి కేంద్రాలలో సంయుక్తంగా ప్రపంచతల్లిపాలవారోత్సవాలను ఘనంగానిర్వహించారు. ఈకార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై చిన్న పిల్లలకుఅన్నప్రసన్న ,అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. అనంతరంగర్భిణీలకు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై పూర్తిస్థాయిలో అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ,ప్రతి తల్లి తన బిడ్డకుజన్మనిచ్చిన గంటలోపే ముర్రుపాలుత్రాగించా లన్నారు. తల్లిపాలు శిశువుకుఅమృతం లాంటివన్నారు. తల్లిపాలు శ్రేష్టకరమైన పోషక విలువలుకలిగినవన్నారు. పిల్లలు బలవంతంగాఎదగడానికి తల్లిపాలే బలమైన పోషకాహారమనితెలిపారు. పుట్టిన బిడ్డకు కనీసం ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమేతాగించాలని సూచించారు. తల్లిపాలు పొందడం ప్రతి శిశువు హక్కు అని, ప్రతితల్లి తన మాతృత్వాన్ని,బాధ్యతను గుర్తించి పిల్లలకు తల్లిపాలుఅందిం చాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు ఎంతో కీలకమనిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వి. రాజ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, కె. శ్రీమతి, రజిని, ఉమారాణి, శారద, అలీమా, హెల్పర్ సునీత,గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.




## శ్రమజీవులపై కేంద్రం కక్ష సాధింపు

### కార్మికులను రోడ్డున పడేస్తున్న లేబర్ కోడ్‌లు..సీఐటీయూ



**దమ్మపేట, (సింగిడి):** మోడీ ప్రభుత్వం దేశంలోని శ్రమజీవులపై దాడిని తీవ్రం చేసిందని, ప్రజలకు అందుతున్న కొద్దిపాటి సబ్సిడీలను కూడా పూర్తిగా రద్దు చేస్తూ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ తీవ్రంగా విమర్శించారు. దమ్మపేట, పట్వారిగూడెం ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా వర్కర్ల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కేంద్రం తెచ్చిన కొత్త లేబర్ కోడ్‌ల వల్ల కార్పొరేట్ కంపెనీల లాభాలు రెట్టింపవు తుంటే, కార్మికులు మాత్రం కుటుంబాల ను పోషించలేక ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలపై మండిపడ్డ ఆయన.. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు లాంటి స్కీం వర్కర్లను వెంటనే ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి నెలకు కనీస వేతనం రూ. 42 వేలు చెల్లించాలని డిమాం డ్ చేశారు. అలాగే చట్టబద్ధమైన 8 గంటల పని దినాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందు లో భాగంగానే ఈనెల 10న జరిగే ప్రభుత్వ కా ర్యాలయాల దిగ్బంధనం, జైలుభరో కార్యక్ర మాలను కార్మికులందరూ కదంతొక్కి విజయవం తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, సునీత, శ్రీలత, సరోజినీ, రాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మేళ్లచెరువు రైస్ మిల్లులో భారీ అక్రమాలు బట్టబయలు

### రూ.53.66 కోట్ల ప్రభుత్వ ధాన్యం, బకాయిలపై అధికారుల ప్రాథమిక నిర్ధారణ





**హుజుర్నగర్ (మేళ్లచెరువు), (సింగిడి):** సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు మండల పరిధిలోని శ్రీ శ్రీనివాస సాయి శివాయ రైస్ ఇండస్ట్రీస్లో మం గళవారం ఉదయం రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, నల్గొండ అధికారులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ ధాన్యం నిల్వలకు సంబంధించి భారీ అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అధికారులు రబీ 2022-23, రబీ 2023-24, ఖరీఫ్ 2024-25, రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వలను పరిశీలించగా, ఆన్‌లైన్ రికార్డులు, స్టాక్ వివరాలు, మిల్లులో భౌతికంగా ఉన్న నిల్వల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక పరిశీలనలో ఆక్షన్ ధాన్యాన్ని మినహాయించి 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అందుబా టులో లేకపోవడం బయటపడినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 5.66 కోట్ల బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అలాగే రబీ 2023-24, ఖరీఫ్ 2024-25, రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు ప్రాథ మికంగా నిర్ధారించారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ. 48 కోట్లుగా అంచనా వేశారు. ప్రభుత్వ ధాన్యం విలువతో పాటు బకాయిలను కలిపి సుమారు రూ. 53.66 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం సంభవించినట్లు అధికారుల బృందం ప్రాథమికంగా నిర్ధారించింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రీజినల్ విజిలెన్స్ అధికారి ప్రతాప్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌస్, జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి మాట్లాడుతూ, ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మాయం చేయడం, దుర్వినియోగం చేయడం లేదా ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చిన్న వ్యాపారులకు తొలి ప్రాధాన్యత కల్పించాలి





### కొండ హరీష్ గౌడ్

**హుజుర్నగర్ (సింగిడి):** హుజూర్‌నగర్ పట్టణ ప్రధాన రహదారిపై కోర్టు ఎదురుగా ఆర్ అండ్ బి మరియు నీటిపారుదల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో గత 30,40 సంవత్సరాలుగా స్థానికంగా నివసిస్తూ చేతివృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవ నోపాధి పొందుతున్న వారికి షాపుల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బాధితులు హుజూర్‌నగర్ బిజెపి పట్టణ అధ్యక్షులు కొం డ హరీష్ గౌడ్ ను కలిసి తమ సమస్యను వివరించారు. బాధితుల విజ్ఞప్తికి స్పం దించిన కొండ హరీష్ గౌడ్ బిజెపి పట్టణ నాయకులతో కలిసి మున్సిపల్ కమి షనర్ మరియు మున్సిపల్ చైర్మన్‌లను కలిసి బాధితుల తరపున వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారిని విస్మరించడం సమంజసం కాదన్నారు. కొత్తగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల కేటాయింపులో స్థానిక బాధితులకు తొలి ప్రాధాన్యత కల్పించి వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా షాపులను కేటాయించాలని, నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితులందరికి న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందని భరోసానిస్తూ, ఒకవేళ వారికి ఏమైనా అన్యాయం జరిగితే బాధితుల తరపున ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడేందుకు బిజెపి సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు బిజెపి లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శిలు గుండా గోపి, రాళ్లబండి రామారావు, మేళ్లచెరువు లక్ష్మణ్, పట్టణ ఉపాధ్యక్షులు పైడిమర్రి విజయ్, యువ మోర్చా అధ్యక్షుడు బలవంత్ సింగ్, పులి నరసింహా, వెంకట్ రెడ్డి, అరుణ్ నాయక్ మరియు బాధితులతో పాటు తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## 10న “జైల్ భరో” జయప్రదం చేయండి

### తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాక్షులు ఎన్ శ్రీనివాస్..జైల్ భరో కరపత్రం ఆవిష్కరణ



**మల్కాజిగిరి, (సింగిడి):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ, దేశాన్ని, రైతాంగ, కార్మిక హక్కులను కాపాడుకోవడానికి 2026 ఆగస్టు 10 వ తేదీన జరిగే కార్యక్రమం సీఐటీయూ కార్యాలయం నుండి ఈసీఐఎల్ చౌరస్తా వం-కు జరిగే ర్యాలీలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ సీఐటీయూ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే ఉన్నికృష్ణ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మల్కాజిగిరిలో మున్సిపల్ వర్కర్స్ సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య పోరాటం తరహాలోనే, నేడు దేశ సార్వభౌమత్వాన్ని మరియు రంగాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న కేంద్ర విధానాలపై ప్రజలందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. బిజెపి ప్రభుత్వం నూతన ఉదారీకరణ విధానాలను తీవ్రంగా అమలు చేస్తూ కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసింది. దిని స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాసింది. ఈ నూతన కోడ్‌ల ద్వారా రోజువారీ పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచడం, యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ ఎప్పుడైనా ఉద్యోగులను తొలగించే “హైర్ అండ్ ఫైర్” విధానాన్ని అమలులోకి తేవడం తీవ్ర ఆందోళనకరం. అలాగే కార్మిక సంఘాల గుర్తింపు, తనిఖీ వ్యవస్థలను దెబ్బతీశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ వీఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య శాఖ పరిధిలోని కోట్లాది మంది స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోగా, పిఎఫ్, ఈఎస్ఐ మరియు సంక్షేమ బోర్డులను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు కొండంత అండగా ఉన్న ‘మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం-2005’ ను ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఈ చట్టానికి “వికసిత్ భారత్ గ్రామ్ జీ” అని పేరు మార్చడమే కాకుండా, కేంద్ర-రాష్ట్రాల నిధుల వాటాను 90:10 నుండి 60:40కి మారుస్తూ నిధుల్లో కోతలు విధిస్తోంది. వేతనాలను పెంచకపోవడం, ఉపాధి రోజులను తగ్గించడంతో పాటు ఉపాధి హామీకి నిధుల కేటాయింపును క్రమంగా ఎత్తివేసే కుట్ర జరుగుతోంది. అంతేకాకుండా ఆహార భద్రతా చట్టంలో సవరణలు చేస్తూ పేదలకు అందే ఉచిత బియ్యం కోటాపై కోతలు విధిస్తూ నిరుపేదల ఆహార భద్రతను దెబ్బతీస్తున్నారని, రాజ్యాంగం ప్రకారం విద్యుత్ అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం “విద్యుత్ సవరణ బిల్లు-2025” ద్వారా విద్యుత్ రంగాన్ని పూర్తిగా తన గుప్పెట్లోకి తీసుకొని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని, దీనివల్ల రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్ విధానానికి మంగళం పాడే ప్రమాదం ఉంది. స్మార్ట్ మీటర్లు, ప్రీపెయిడ్ మీటర్లు బిగించి సామాన్య ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్ విధానం అమలవుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లు మరియు విధానాల వల్ల భవిష్యత్తులో డిస్కంలు మరిన్ని కష్టాల్లోకి వెళ్లి ప్రైవేటీకరణకు మార్గం సుగమం అవుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక రంగాలు మరియు ప్రజాస్వామ్య వాదులందరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన ర్యాలీలు



**కోదాడ, (సింగిడి):** అంతర్జాతీయ తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా అనంతగిరి మండలంలోని శాంతినగర్, బొజ్జగూడెం తండా అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బొజ్జగూడెం తండాలో అంగన్‌వాడీ టీచర్లు భువన, వీరమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని మాట్లాడుతూ, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. తల్లిపాలే బిడ్డకు తొలి టీకా అని, పిల్లల ఆరోగ్యకర ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ వాడకొప్పుల ఉమ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## పే స్కేలు అమలు చేయాలి

### 3వ రోజు కొనసాగుతున్న వీబీజీ రామ్‌జీ ఉద్యోగుల నిరసన



**హుజుర్నగర్ (మఠంపల్లి) (సింగిడి):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ (వీబీజీ రామ్‌జీ) ఉద్యోగుల నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలోని వీబీజీ రామ్‌జీ కార్యాలయం వద్ద ఉద్యోగులు పెన్‌డౌన్, షట్‌డౌన్ నిర్వహిస్తూ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజలకు చేరవేయడంలో తాము కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఇప్పటికీ తమకు తగిన పే స్కేలు, బేసిక్ పే స్కేలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ సేవలను నిబద్ధతతో అందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్లలో భాగంగా వెంటనే పే స్కేలు అమలు చేయాలని, గత 20 సంవత్సరాలుగా అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఫిక్స్డ్ టెన్యూర్ ఎంప్లాయిస్‌లుగా (ఎఫ్ టి ఈ)లు కన్వర్ట్ చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉమ, ఈసీ సందీప్, టీఏలు, సిటన్ వీబీజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాలతోనే శిశువుకు

## సంపూర్ణ పోషణ



**పెబ్బేరు, (సింగిడి):** పెబ్బేరు మండలం కంచిరా వుపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అధికారులు, అంగన్వాడీ సిబ్బంది వివరించారు. నవజాత శిశువుకు పుట్టిన వెంటనే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలను అందించడమే కాకుండా, రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని వివరించారు. అనంతరం ఆరు నెలలు పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్పంచ్ ఆరుణమ్మ చేతుల మీదుగా సంప్రదాయబద్ధంగా అన్న ప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు మొదటి సారిగా ఘనాహారం అందిస్తూ వారి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఆకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుణమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఏసీడీపీఓ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కోసం ప్రశ్నిస్తే దాడులా!

### అభివృద్ధిలో భాగం పంచుకోవాలనే రాజకీయంలోకి చేరాను..

### వార్డ్ మెంబర్ బాధవత్ జనార్దన్



**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** ఉన్నంత విద్యలు చదివి గ్రామ అభివృద్ధిలో భాగం పంచుకోవాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని 7 వ వార్డ్ మెంబ ర్ బాధవత్ జనార్దన్ మీడి యాతో మాట్లాడారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం గ్రామపం చాయతీలో జరుగుతున్న అవినీతిపై గ్రామస భల్లో ప్రశ్నించి నందుకు నాపై భౌతిక దాడికి దిగారన్నారు. ఆరు నెలల వ్యవ ధిలోనే 10 లక్షల రూపాయల సొమ్మును గ్రామపం చాయతీ కోసం ఖర్చు చేసినట్టు లెక్కలు చూపించారు. అందులో బ్లీచింగ్ పౌడర్ కోసంరెండు నెలల వ్యవధిలోనే 80 వేల రూపాయల పైబడి ఖర్చు చేసినట్టు ఆధారాలుఉన్నాయని వార్డు మెంబర్ తన ఆవేద నని వ్యక్తం చేశారు. నిజాయితీగా పనిచేసి గ్రామ అభివృద్ధిలో భాగం పంచుకోవాలనేదే ముఖ్య ఉద్దేశమ న్నారు. గ్రామసభజరుగుతుండగా అందరి సమక్షంలో నా పై దాడికి వచ్చారనితెలిపారు. కార్యదర్శి,గ్రామ సర్పంచ్, ఉపస ర్పంచ్ లను గ్రామపంచా యతీ లెక్కలను అడగగా,ఎలాంటి సమా చారం ఇవ్వకుండా దాడికి దిగారన్నారు. గ్రామ పార్టీ అధ్య క్షులు లెక్కల విషయంలో తప్పు పట్టిస్తూ నన్ను బెదిరి స్తున్నారన్నారు.

singidinews@gmail.com

## ప్యారడైజ్‌తో పోటీ పడనున్న

# డోరతి మూవీ

Dorothy




న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

Kayadu Lohar



సినిమా సింగిడి
Cinma Singidi

గురువారం
6-8-2026



## ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు.





'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## విడుదలకు సిద్ధం అవుతున్న కొరియన్ కనకరాజు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం.

Rithika Nayak

## సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు



ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090